PRAJASAKTI Regd.No. 15795/68 సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 58 | విజయవాడ, ఆదివారం 28 సెప్టెంబర్ 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No Vijayawada, Sunday 28 September 2025 Rs

ఆసియా సవాల్

- ఫైనల్లో భారత్, పాకిస్తాన్ ఢీ నేడు
- జోరుమీదున్న టీమ్ ఇండియా

5

హైడ్రో పవర్ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ చేపట్టిన బహిరంగ సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

తమిళనాట పెను విషాదం

- విజయ్ కరూర్ ర్యాలీలో తొక్కిసలాట
- 39 మంది మృతి
- వందలాదిమందికి గాయాలు
- రాష్ట్రపతి, ప్రధాని, సిఎం ప్రభృతుల సంతాపం

కరూర్ : ప్రముఖ సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం (టివికె) అధ్యక్షుడు విజయ్ ప్రచార సభలో పెను విషాదం చోటు చేసుకుంది. కరూర్‌లోని వేలుచామిపురంలో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో జరిగిన తొక్కిసలాటలో 39 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆరుగురు చిన్నారులు, 16 మంది మహిళలు ఉన్నట్లు గుర్తించారు. వందలాదిమంది గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోడీ, తమిళనాడు సిఎం స్టాలిన్, కేరళ సిఎం పినరయి విజయన్, సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ ప్రభృతులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ దురదృష్టకర సంఘటన తీవ్రంగా కలచివేసిందని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. కష్టసమయంలో వారికి మనోధైర్యం అందించాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, క్షతగాత్రులకు లక్ష చొప్పున పరిహారాన్ని సిఎం స్టాలిన్ ప్రకటించారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు సభ నిర్వహించేందుకు పోలీసులు అనుమతించగా, విజయ్ సాయంత్రం 6 గంటలకు వేదిక వద్దకు చేరుకున్నారు. కరూర్‌తోపాటు సమీపంలోని మూడు జిల్లాల నుంచి వచ్చిన విజయ్ అభిమానులు, మద్దతుదారులు, పార్టీ కార్యకర్తలు, రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన పార్టీ స్వచ్ఛంద కార్యకర్తలు ఆరుగంటలకుపైగా ఎండలో వేచివున్నారు. జనాలు బాగా ఎక్కువగా వుండడం, కిక్కిరిసిపోయి వుండడం, వేడిగా వుండడంతో సభ జరుగుతుండగానే కొందరు ఊపిరాడక కళ్లు తిరిగి పడిపోయారు. కొందరు అభిమానులు విజయ్‌ను దగ్గర నుండి చూడాలనే ఉద్దేశంతో బస్సు సమీపంలోకి వెళ్లడానికి ప్రయత్నించడంతో తొక్కిసలాట జరిగింది. తొక్కిసలాటలో గాయపడిన వారిని వెంటనే కరూర్ ప్రభుత్వ ఆసుపత్రికి, సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రులకు హుటాహుటిన తరలించారు. 500మందికి పైగా ఇప్పటికే ఆస్పత్రుల్లో చేరారు. మరో 400మందిని పైగా తీసుకొస్తున్నారని సీనియర్ పోలీసు అధికారి డేవిడ్సన్ దేవాశీర్వాదం తెలిపారు. తొక్కిసలాట సమాచారం అందడంతో షెడ్యూల్ సమయానికి కన్నా ముందుగానే విజయ్ తన ప్రసంగాన్ని ముగించేశారు. జనాల రద్దీ బాగా వుండడంతో అంబులెన్సులు అవసరమైన చోటుకు వెళ్లడానికి కూడా బాగా సమయం పట్టేసింది.

క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించేందుకు సభ వద్దకు చేరుకున్న అంబులెన్స్‌లు, చిత్రంలో సినీ నటుడు, టివికె అధ్యక్షుడు విజయ్

దిగ్భ్రాంతికరం : సిపిఎం

విజయ్ ర్యాలీలో భారీ సంఖ్యలో ప్రజలు మరణించడం దిగ్భ్రాంతికరమని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద ఘటనకు బాధ్యులను నిర్ణయించేందుకు విచారణ జరపాలని కోరారు. ఆరు గంటలు ఆలస్యంగా రావడమే ఈ విషాదానికి కారణమని నివేదికలు వస్తున్నాయని తెలిపారు. మృతుల్లో ఎక్కువమంది పిల్లలు, మహిళలు ఉండటం తీవ్ర విషాదమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. షణ్ముగం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరే ఇతర ప్రచార ర్యాలీలోనూ ఇంతమంది మరణించలేదని తెలిపారు.

సహాయక చర్యలకు సిఎం ఆదేశం

విషయం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ కరూర్ కలెక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు తక్షణ చికిత్స అందించాలని, సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంత్రులు సుబ్రమణియన్, అన్బిల్ మహేష్, ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులను తొక్కిసలాట జరిగిన ప్రదేశానికి, కరూర్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సెంథిల్ బాలాజీ వెంటనే కరూర్‌కు చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. శనివారం రాత్రి 9 గంటల సమయానికి తొక్కిసలాటలో పిల్లలు సహా 39 మంది మరణించారని తమిళనాడు ప్రజారోగ్య మంత్రి ఎం. సుబ్రమణియన్ ప్రకటించారు. ఇంకా చాలా మందికి తీవ్ర చికిత్స అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. కరూర్ తొక్కిసలాట ఘటన తనకు తీవ్ర ఆందోళన కలిగిస్తోందని సిఎం స్టాలిన్ అన్నారు. శనివారం రాత్రి 9.40 గంటలకు సచివాలయానికి వచ్చిన ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆదివారం ఉదయం ఆయన కరూర్ వెళ్లనున్నారు.

జలసమాధి చేస్తామంటే ఊరుకోం

- 'అరణ్య గర్జన' సభలో వి శ్రీనివాసరావు
- హైడ్రో ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ పోటెత్తిన ఆదివాసీలు

ప్రజాశక్తి– అరకులోయ రూరల్ (అల్లూరి జిల్లా)

హైడ్రో పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసి గిరిజనులను జల సమాధి చేస్తామంటే ఊరుకునేది లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. అడవులను కార్పొరేట్ కంపెనీలకు అమ్మొద్దని, హైడ్రో పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసి గిరిజనులను జలసమాధి చేయొద్దని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక కమిటీ ఆధ్వర్యాన అల్లూరి జిల్లా హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ మజ్జివలసలో ఆదివాసీ అరణ్య గర్జన సభ శనివారం జరిగింది. భారీగా తరలివచ్చిన ఆదివాసీలు భారీ ప్రదర్శన నిర్వహించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినదించారు. ప్రాజెక్టులకు అనుమతినిస్తూ జారీ చేసిన జిఒలు 51, 13, 2లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జరిగిన సభకు ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కృష్ణారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలు రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ఏరియాలో ఉన్నాయని, గ్రామ సభ, పీసా కమిటీ, ప్రజల అనుమతి లేకుండా ఈ ప్రాంతాల్లో ఒక్క సెంటు భూమి కూడా తీసుకునే హక్కు, అధికారం ప్రభుత్వాలకు లేదన్నారు. గిరిజన చట్టాలను, రాజ్యాంగాన్ని పక్కనపెట్టి భూములను గుంజుకొని, గిరిజనులను జలసమాధి చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాల్లో హైడ్రో ప్రాజెక్టుల నిర్మాణం చేపడితే సుమారు 250 గ్రామాల ప్రజలు, 50 వేల మంది గిరిజనులు, పంట పొలాలు జలసమాధి అవుతాయన్నారు. గ్రీన్ ఎనర్జీ పేరుతో విద్యుదుత్పత్తి కోసమని అదాని, నవయుగ, షిరిడీ సాయి కంపెనీలకు భూములు కట్టబెడుతున్నారని, ఈ చర్యలతో పర్యావరణం ధ్వంసమవుతుందని తెలిపారు. ప్రకృతిని నాశనం చేయడం తగదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులతో కుమ్మక్కై, వారి లాభాల కోసం చేపడుతున్న చర్యలను పోరాటాలతో తిప్పికొట్టాలని ఆదివాసీలకు ఆయన పిలుపునిచ్చారు. ప్రాజెక్టులు నిర్మిస్తే ఉద్యోగాలు వస్తాయంటూ ప్రభుత్వాలు భ్రమలు కల్పిస్తున్నాయన్నారు. ఇప్పటి వరకూ అలా ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారో లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. సీలేరు జెన్‌కో ఏర్పాటు, ఆదివాసీలకు ఉద్యోగాల కల్పన విషయంలో ఏం జరిగిందో ఉదాహరించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గిరిజన ప్రాంతంలో పర్యటించి అడవి తల్లి బాట అంటూ పేరు పెట్టారని, అది అడవి తల్లి బాట కాదని, అదాని బాట అని వి.శ్రీనివాసరావు విమర్శించారు. గిరిజనులకు చెప్పులు, పండ్లు పంచి వారికి దగ్గరై కార్పొరేట్ కంపెనీలకు ఏజెన్సీని ధారదత్తం చేయాలని చూస్తున్నారన్నారు. ఆదివాసీలకు ఏజెన్సీలో శతశాతం ఉద్యోగాలు కల్పించే జిఒ 3 పునరుద్ధరణ హామీ నేటికీ నెరవేరలేదని తెలిపారు. ఉద్యోగాల కల్పనలో ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. ప్రభుత్వాలు అదాని బాట వదిలిపెట్టకపోతే ప్రజలు ఇంటి బాట పట్టిస్తారని హెచ్చరించారు.

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ హైడ్రో ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ గిరిజన ప్రాంత ఎమ్మెల్యేలు పదవులకు రాజీనామా చేసి ఆదివాసీలతో కలిసి పోరాటానికి రావాలన్నారు. హైడ్రో ప్రాజెక్టుల కోసం అదాని, నవయుగ కంపెనీల వ్యక్తులు వస్తే ఆదివాసీలు తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఎం మిగతా 7లో

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయండి

- మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని మండలిలో పిడిఎఫ్ ఎంఎల్‌సి బి.గోపిమూర్తి కోరారు. శనివారం మండలిలో ప్రత్యేక ప్రస్తావన ద్వారా అయన ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులరైజ్ చేసేందుకు యాక్టు 30, జివో 114 ద్వారా వైద్య ఆరోగ్య శాఖలో దాదాపు 3 వేల మందిని రెగ్యులరైజ్ చేశారని గుర్తు చేశారు. ఇంకా మిగిలి ఉన్న వారిని కూడా రెగ్యులరైజ్ చేయాలన్నారు. అలాగే విద్యారంగంలో వివిధ రకాల పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో గెస్టు లెక్చరర్స్‌కు గంటల ఆధారంగా కాకుండా కన్సాలిడేట్ పే గా జీతాలు చెల్లించాలని కోరారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. డిగ్రీ కళాశాలల గెస్టు లెక్చరర్లకు జీతాలు పెంచాలన్నారు. కాంట్రాక్టు, గెస్టు లెక్చరర్ల ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలన్నారు. వివిధ యూనివర్సిటీల్లో పనిచేసే కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల కు రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల మాదిరిగా ఉద్యోగ విరమణ వయస్సును 65 ఏళ్లకు పెంచాలని కోరారు.

సిపిఎస్ రద్దు మెమో 57 అమలు చేయండి

2004కి ముందు నోటిఫికేషన్ ఇచ్చి 2004 తదుపరి నియామకాలు జరిగిన ఉద్యగులకు ఒపిఎస్ అమలు కోసం కేంద్ర ప్రభుత్వం మెమో 57 ఇచ్చిందని గోపిమూర్తి సభ దృష్టికి తెచ్చారు. దీని ఆధారంగా దేశంలోని 15 రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోనూ ముగ్గురు ఐఎఎస్ అధికారులకు ఒపిఎస్ అమలు చేశారని ఆయన గుర్తు చేశారు. సాధారణ ఉద్యోగ,ఉపాధ్యాయులను కూడా మెమో నెంబరు 57 ప్రకారం ఒపిఎస్‌లోకి తీసుకురావాలన్నారు. 2004 తదుపరి నియామకం పొందిన వారికి పాత పెన్షన్ అమలు చేయుటకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

విశాఖ ఉక్కును సమాధి చేసి మిట్టల్ స్టీల్‌ప్లాంట్ నిర్మాణమా?

- ప్రజాభిప్రాయ సేకరణలో నిలదీసిన కె.లోక్‌నాథం

నేవీ ఆయుధ డిపోను నిర్మించొద్దు

- ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానం

గోదావరికి మళ్లీ వరద

- భద్రాచలంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

3

స్వదేశీ 4జితో కనెక్టివిటీ విప్లవం

- 2030 నాటికి 6జి
- బిఎస్ఎన్ఎల్ 4జి ప్రారంభోత్సవంలో చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వదేశీ 4జి నెట్‌వర్క్‌తో దేశంలో కనెక్టివిటీ విప్లవం వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. . దేశీయంగా రూపొందించిన సాంకేతికతతో దేశంలోని మారుమూల ప్రాంతాలు అనుసంధానం కావడం ప్రగతికి సూచిక అని వెల్లడించారు. ఒడిశాలోని ఝార్సుగూడ నుంచి ప్రధాన మంత్రి మోడీ ప్రారంభించిన స్వదేశీ 4జి నెట్‌వర్క్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా పాల్గొన్నారు. విజయవాడలోని ఒక కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్రంలోని 10 మారుమూల గ్రామాలు సహా దేశ వ్యాప్తంగా 108 గ్రామాల్లో 4జి సేవలను ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. అంతకుముందు ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 1995 నుంచి దేశంలో టెక్నాలజీ, సమాచార సాంకేతిక అంశాల్లో ముందుకు వెళ్లాలని భావించానని అది ఇప్పుడు సాధ్యమైందన్నారు. ఒక బిలియన్ వినియోగదారులను కలిగిన సమాచార వ్యవస్థతో బిఎస్ఎన్ఎల్ దేశంలోనే శక్తిమంతమైన సంస్థగా మారిందన్నారు. ఈ సంస్థ నుంచి మరిన్ని కొత్త ఆవిష్కరణలు రావాలన్నారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా లక్ష 4జి సైట్లను ఏర్పాటు చేసి 4 పెటా బైట్ల డేటాను ప్రతిరోజూ అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. మొత్తం 26,707 మారుమూల గ్రామాలను 4జి టెక్నాలజీతో అనుసంధానించడం దేశ ప్రగతికి మరో ముందడుగు అవుతుందన్నారు. ప్రస్తుతం 2010లో 4జి, 2020లో 5జి టెక్నాలజీలు వచ్చాయని, 2030లో 6జి రాబోతుందన్నారు. ప్రతి పదేళ్లకు నూతన ఆవిష్కరణలు తోడవుతున్నాయని తెలిపారు. మరోవైపు దేశంలో తయారైన కోవిడ్ వ్యాక్సిన్ వంద దేశాల ప్రజలను కాపాడిందన్నారు. ప్రస్తుతం ప్రపంచమంతా నాలెడ్జ్ ఎకానమీ దశలో ఉందని, దీనిని మన దేశ యువత అందిపుచ్చుకోవాలని సూచించారు. రాష్ట్రంలో మొబైల్ ఫోన్‌తో 735 పౌరసేవలను వాట్సాప్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా దేశంలో తయారైన సెల్ ఫోన్లను ప్రపంచ దేశాలు వినియోగిస్తున్నాయని చెప్పారు. ఎఐ, క్వాంటం టెక్నాలజీలు ఇప్పుడు రియాలిటీలోకి వచ్చాయన్నారు. వచ్చే ఏడాది జనవరికి అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్ర సమాచార, గ్రామీణాభివృద్ధి శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గతంలో ల్యాండ్‌లైన్ ఫోన్ కావాలంటే ఎమ్మెల్యే, ఎంపిలు సిఫార్సు చేయాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కొన్నేళ్ల కిందట సెల్‌ఫోన్‌లో మాట్లాడాలంటే ఖర్చుతో కూడుకున్న విషయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, బిఎస్ఎన్ఎల్ డైరెక్టర్ వివేక్ బన్సాల్, సి-డాట్ సిఇఒ ఆర్‌కె ఉపాధ్యాయ, డిజిఎం శేషాచలం తదితరులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ 4జి ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

ఉభయ సభలు నిరవధిక వాయిదా

- కూటమిలో లుకలుకలు వెల్లడి
- మండలిలో సర్కారును నిలదీసిన వైసిపి
- ప్రజాసమస్యలపై పిడిఎఫ్ ధ్వజం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈ నెల 18న ప్రారంభమైన అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు శనివారం ముగిశాయి. ఉభయ సభలు నిరధికంగా వాయిదా పడ్డాయి. సమావేశాలను ఈ నెల 30 వరకు నిర్వహించాలని తొలుత అనుకున్నా 27వ తేదీకే ముగించారు. ఈ తడవ కూడా శాసనసభకు వైసిపి సభ్యులు హాజరు కాలేదు. తమ పక్ష నాయకుడు జగన్ మోహన్‌రెడ్డికి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని వెలుపలి నుంచి తమ డిమాండ్‌ను కొనసాగించారు. ప్రతిపక్షం లేకపోవడంతో శాసనసభ కూటమి మూడు పార్టీల సభగా నడిచింది. శాసన మండలికి వైసిపి సభ్యులు హాజరై ప్రభుత్వాన్ని ఎదుర్కొనే ప్రయత్నం చేశారు. పిడిఎఫ్ ప్రజా సమస్యలపైనా, ప్రభుత్వ వైఫల్యాలపైనా తన శక్తి మేరకు నిలదీసింది. ఈసారి శాసనసభలో కూటమి పార్టీల మధ్య అసంతృప్తులు, అసహనాలు వ్యక్తమయ్యాయి. టిడిపి సభ్యులే ఎక్కువగా తమ జిల్లాల్లోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి ప్రతిపక్షంలా వ్యవహరించారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో సభ్యుల ప్రశ్నలకు మంత్రులు ఇచ్చిన సమాధానాలపై సంతృప్తి చెందకుండా విమర్శల దాడి చేశారు. కొంత మంది మంత్రులను లక్ష్యంగా చేసుకుని ఎమ్మెల్యేలు గట్టిగా మాట్లాడటం కనిపించింది. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న కాలుష్య నియంత్రణ మండలిలో అవినీతిపై టిడిపి సభ్యుడు బొండా ఉమా ఆరోపణలు చేశారు. వాటిపై పవన్ అసహనం వెలిబుచ్చారు. మంత్రులు నాదెండ్ల మనోహర్‌ను బుచ్చయ్య చౌదరి, కె.పార్ధసారధిని దూళిపాళ్ల నరేంద్ర, కూన రవికుమార్, తెనాలి శ్రావణ్‌కుమార్ ఇరుకున పెట్టారు. ప్రతిపక్షం హాజరు కాకపోయినా తమ పార్టీ సభ్యులే మంత్రులను నిలదీస్తున్నారని మంత్రి నారా లోకేష్ మీడియాతో వ్యాఖ్యానించారు. కాగా ఏ పని కావాలన్నా, ఎవరిని నియమించుకోవాలన్నా మంత్రి లోకేష్ పర్మిషన్ తీసుకోవాలంటున్నారని బిజెపి సభ్యుడు విష్ణుకుమార్‌రాజు అన్నారు. సభ ఎనిమిది రోజులు జరగ్గా ఏడు రోజుల పాటు ఏడు అంశాలపై సిఎం చంద్రబాబు నాయుడు సుదీర్ఘంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన గత ఐదేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వ తీరును ఎండగట్టి తమ ప్రభుత్వ విధానాలను ఏకరవుపెట్టారు. శాసనమండలిలో వైసిపికి మెజార్టీ ఉండటంతో ఆ పార్టీ ప్రభుత్వాన్ని అడుగడుగునా అడ్డుకోగలిగింది. పిపిపి పద్ధతిలో మెడికల్ కళాశాలల ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తూ మూడు రోజులు సభను స్తంభింప చేశారు. మండలిలో జిఎస్‌టి సంస్కరణలపై తీర్మానం, పిపిపి పద్ధతిలో మెడికల్ కళాశాలలు ఏర్పాటును వ్యతిరేకించారు. దుకాణాలు, వ్యాపార సంస్థల్లో పనిగంటల పెంపు బిల్లును కూడా వైసిపి వ్యతిరేకించింది. మండలి చైర్మన్ మోషన్‌రాజును అవమానించారని, ప్రొటోకాల్ పాటించడం లేదని మండలిని స్తంభింపచేసింది. దీనిపై ప్రభుత్వం క్షమాపణ చెప్పింది. రాజకీయ కక్షలతో హత్యకు గురయిన తోట చంద్రయ్య కుమారునికి శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగం కల్పించే బిల్లును వైసిపి అడ్డుకోవడంతో పెండింగ్‌లో మిగతా 7లో

బ్రిక్స్‌లో సభ్యత్వానికి పాలస్తీనా దరఖాస్తు

బీజింగ్ : బ్రిక్స్‌లో సభ్యత్వం కోసం పాలస్తీనా దరఖాస్తు చేసుకుంది. ఇటీవల పలు దేశాలు పాలస్తీనాను ఒక దేశంగా గుర్తించిన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు పాలస్తీనా దౌత్యవేత్త ఒకరు శుక్రవారం తెలిపారు. ఇంకా తమ దరఖాస్తుకు ఎలాంటి స్పందన రాలేదని రష్యాలో పాలస్తీనా రాయబారి అబ్దుల్ హఫీజ్ నోఫల్ తెలిపారు.

పూర్తిస్థాయి సభ్యురాలిగా మారేవరకు అతిథి దేశంగా బ్రిక్స్ సమావేశాల్లో పాల్గొనాలని పాలస్తీనా భావిస్తోందని చెప్పారు. తొలుత బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాలతో ఏర్పడిన బ్రిక్స్‌ను గతేడాది విస్తరించారు. ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌ను చేర్చారు. ఈ ఏడాది ఇండోనేషియా చేరుతోంది.

దీనిపై చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి గుయో జియాకున్ స్పందిస్తూ, బ్రిక్స్‌లో చేరేందుకు భావ సారూప్య పక్షాలను తాము స్వాగతిస్తున్నట్లు చెప్పారు. న్యాయమైన, సమతుల్యతతో కూడిన అంతర్జాతీయ వ్యవస్థ కోసం సంయుక్తంగా కృషి చేయాల్సి వుందని గుయో చెప్పారు.



'మూసీ' మహోగ్రరూపం

- జలదిగ్భంధంలో ఎంజిబిఎస్

2

విద్యుత్ వినియోగదారులకు ట్రూడౌన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజల నుంచి పన్నులు, ఛార్జీల రూపంలో భారీగా వసూలు చేసి చివరలో కొంత తగ్గించి ఉపశమనం కల్పిస్తున్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. ఏనిమిదేళ్ల పాటు జిఎస్‌టి రూపంలో రూ.లక్షల కోట్లు వసూలు చేసిన కేంద్రం ఇటీవల కొన్ని శ్లాబులను తగ్గించి పండగ కానుక ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటోంది. ప్రజల నుంచి రూ.వేల కోట్ల ఛార్జీలు వసూలు చేసిన విద్యుత్ పంపిణీ సంస్థలు కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయి. ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎల పేరుతో సుమారు రూ.30 వేల కోట్లకు పైగా వసూలు చేసి ఇప్పుడు ట్రూడౌన్ పేరుతో రూ.923 కోట్లు వినియోగదారులకు వెనక్కి ఇస్తున్నాయి. విద్యుత్ వినియోగదారుల నుంచి అధికంగా వసూలు చేసిన ఛార్జీల్లో కొంత వారికే తిరిగి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) డిస్కమ్‌లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కమిషన్ కార్యదర్శి కృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) విద్యుత్ వినియోగదారుల నుంచి ఎఫ్‌పిపిసిఎ పేరుతో నెలకు 40 పైసలు చొప్పున రూ.2,787 కోట్లు వసూలు చేసిన విషయం తెలిసిందే. ఎపిఎస్‌పిడిసిఎల్ రూ.1,106 .56 కోట్లు, ఎపిసిపిడిసిఎల్ రూ.614.86 కోట్లు, ఎపిఇపిడిసిఎల్ రూ.1,065.76 కోట్లు చొప్పున వసూలు చేశాయి. ఇందులో మిగులు ఉన్నా ఇపిడిసిఎల్ రూ.1,435.89 కోట్లు అదనంగా వసూలు చేసినట్లు నియంత్రణ మండలి తేల్చింది. ఎస్‌పిడిసిఎల్‌కు రూ.207.95 కోట్లు, సిపిడిసిఎల్‌కు రూ.304.39 కోట్లు వినియోగదారులు చెల్లించాల్సి ఉందని తెలిపింది. ఇపిడిసిఎల్‌లో అదనంగా వసూలు చేసిన రూ.1,435.89 కోట్లను మూడు డిస్కంలకు ఇఆర్‌సి సర్దుబాటు చేసింది. దీంతో రూ.923.55 కోట్లు వినియోగదారులకు తిరిగి వెనక్కి చెల్లించాలని నిర్ణయించింది. ఈ ఏడాది నవంబర్ నుంచి 2026 అక్టోబర్ వరకు 13 పైసలు చొప్పున మూడు డిస్కంలు వినియోగదారులకు వెనక్కి ఇవ్వాలని ఆదేశాలిచ్చింది.

జిసిసికి బిజినెస్ లైన్ ఛేంజ్ మేకర్ అవార్డు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ గిరిజన సహకార సంస్థకు బిజినెస్ లైన్ ఛేంజ్‌మేకర్ అవార్డు లభించింది. ముంబయిలో ఈ నెల 26న జరిగిన కార్యక్రమంలో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ నుంచి సంస్థ వైస్ ఛైర్‌పర్సన్, ఎమ్‌డి కల్పన కుమారి ఈ అవార్డును అందుకున్నారని గిరిజన సహకార సంస్థ (జిసిసి) శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. 1956 నుంచి గిరిజనుల ఆర్థిక, సామాజిక అభివృద్ధి పట్ల నిబద్ధతతో పనిచేస్తున్న జిసిసి 1970లో అరకు వ్యాలీలో ప్రవేశపెట్టిన కాఫీ సాగుతో గిరిజన రైతులకు స్థిరమైన ఆదాయం, ఇక్కడి కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు లభించిందని తెలిపింది. 2019లో జిఐ ట్యాగ్ పొందిందని వెల్లడించింది. 2024లో 2,600 మంది రైతులు 6 వేల ఎకరాల్లో కాఫీ, మిరియాల తోటలకు సేంద్రియ ధ్రువీకరణ పొందినట్లు తెలిపింది. ప్రస్తుతం ఈ ధ్రువీకరణ 15 వేల ఎకరాలకు విస్తరించే ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొంది. 2025 ఆగస్టు 9 ఆదివాసీ దినోత్సవాల్లో భాగంగా టాటా కన్జ్యూమర్ ప్రోడక్ట్స్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందంలో భాగంగా ఆర్గానిక్ సొల్యుబుల్ కాఫీ ఉత్పత్తి ప్రారంభం కానుందని వెల్లడించింది.

డెత్ బెనిఫిట్ పెంపునకు తీర్మానం పట్ల ఐలు హర్షం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

న్యాయవాదుల మరణానంతరం వారి వారసులకు అందజేసే పరిహారాన్ని పెంచుతూ రాష్ట్ర బార్ కౌన్సిల్ తీర్మానించడం పట్ల అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలు) రాష్ట్ర అధ్యక్షులు కె కుమార్, ప్రధాన కార్యదర్శి ఎన్ మాధవరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం డెత్ బెనిఫిట్‌గా ఉన్న రూ.6 లక్షల నుంచి రూ.9 లక్షలకు, మెడికల్ బెనిఫిట్ రూ.1.50 లక్షల నుంచి రూ.2.50 లక్షలకు పెంచుతూ తీర్మానం చేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన మ్యాచింగ్ గ్రాంట్‌ను కూడా రూ.9 లక్షలకు పెంచే విధంగా, ప్రభుత్వం నుంచి రావాల్సిన 1,175 మంది కుటుంబాలకు డెత్ బెనిఫిట్స్ త్వరితగతిన వచ్చేలా బార్ కౌన్సిల్ ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యం

- అక్టోబరు 4న ఆటో డ్రైవర్లకు రూ.15వేలు సహాయం
- సూపర్ సిక్స్‌పై చర్చలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర పునర్నిర్మాణమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. శాసనసభలో శనివారం 8వ రోజు సూపర్‌సిక్స్, మేనిఫెస్టో అమలుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ పేదల కోసం అనునిత్యం పనిచేయడంతో పాటు తెలుగు జాతిని నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ప్రధాని మోడీ, పవన్‌కల్యాణ్ సహకారంతో ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తోందన్నారు. ఇదో టీమ్ అని, ఇందులో ఏ ఒక్కరూ తప్పు చేసినా విఘాతం కలిగించేలా వ్యవహరించినా రాష్ట్రానికి నష్టం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యేలు పర్సనల్ అజండాలు పెట్టుకుని మాట్లాడితే రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యానికి అడ్డంకి కలుగుతుందని చంద్రబాబునాయుడు అన్నారు. అక్టోబరు 4న సాయంత్రం 4గంటలకు 'ఆటో డ్రైవర్ల సేవలో..' అనే పేరుతో సొంత వాహనం కలిగిన ప్రతి ఆటో డ్రైవర్లకు రూ.15వేలు ఆర్థిక సహాయం వారి అకౌంట్లలో జమ చేయనున్నట్లు చెప్పారు.



ఈ పథకానికి రాష్ట్రంలో 3,23,375 దరఖాస్తులు రాగా అందులో 2,90,234 దరఖాస్తులు అర్హులుగా ఎంపికయ్యారన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి ఏడాదికి రూ.435కోట్లు ఖర్చువుతుందన్నారు. దీపావళి కానుకగా మరో 10 రోజుల్లో 3లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తామని, మరో 6.15లక్షల ఇళ్లను 2026 జూన్ నాటికి అందుబాటులోకి తెస్తామని సిఎం తెలిపారు. 2029 నాటికి ప్రతి ఒక్కరికీ ఇళ్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మేనిఫెస్టో హామీలను చాలా వరకు అమలు చేశామని, చెత్తపన్నును రద్దు చేశామన్నారు. విశాఖలో త్వరలో గుగూల్ ప్రారంభం కాబోతోందని, గుగూల్ రాకతో విశాఖ టెక్నికల్ హబ్‌గా మారబోతోందని సిఎం శాసనసభలో వెల్లడించారు.

ఆడబిడ్డల ఆర్థిక ఎదుగుదలకు స్త్రీ శక్తి పథకం తోడ్పడుతుండటం సంతోషాన్నిస్తుందన్నారు. స్త్రీ శక్తి వల్ల ఆర్‌టిసి ఆక్యుపెన్సీ పెరిగిందని, ఉచిత బస్సుప్రయాణ స్కీమ్‌కు ఏడాదికి రూ.2,963కోట్లు ఖర్చువుతుందని తెలిపారు. తల్లికి వందనం పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేశామని, ఈ పథకానికి రూ.10,090.74కోట్లను ఖర్చు పెట్టామని సిఎం తెలిపారు . రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు.

ప్రభుత్వానికి సదుపాయాల కమిటీ నివేదిక

- ప్రజా ప్రతినిధుల పెన్షన్ రూ.30 వేల నుంచి గరిష్టంగా రూ.70 వేలకు పెంపు
- సిఫార్సు చేసిన కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు నేతృత్వంలోని సదుపాయాల కమిటీ (ఎమినిటీస్) రాష్ట్ర ప్రభుత్వానికి తొలి నివేదికను శనివారం అందజేసింది. శాసనమండలి, శాసనసభ సభ్యులకు కల్పించే వసతి, వైద్య సదుపాయాలను పరిశీలించి ప్రభుత్వానికి పలు సిఫార్సులను చేసింది.

ఆయా అంశాలకు సంబంధించి పలు రాష్ట్రాల శాసన వ్యవస్థ సేకరించి, క్రోడీకరించిన సమాచారాన్ని అధ్యయనం చేసి రాష్ట్రంలో ప్రస్తుత, మాజీ సభ్యులకు కల్పిస్తున్న సదుపాయాల్లో మెరుగుదలకు ఆస్కారం ఉందని కమిటీ భావించింది. మాజీ సభ్యుల పింఛన్ మణిపూర్‌లో నెలకు కనీసం రూ.70 వేలు, పంజాబ్‌లో రూ.50 వేలుగా ఉన్న విషయాన్ని కమిటీ పరిగణనలోకి తీసుకుంది. ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో మాజీ సభ్యులకు నెలవారీ పెన్షన్‌ను రూ.30 వేల నుంచి రూ.50 వేలకు పెంచాలని, గరిష్ట సరాసరి నెలవారీ పెన్షన్ రూ.70 వేలకు పరిమితం చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. భారత సర్వీసుల అధికారులతో సరి సమానంగా వైద్య సదుపాయాలు కల్పించాలని కమిటీ సిఫార్సు చేసింది.

'మూసీ' మహోగ్రరూపం

- జలదిగ్బంధంలో ఎంజిబిఎస్
- నీట మునిగిన హైదరాబాద్ లోతట్టు ప్రాంతాలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి తోడు హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జలాశయాల గేట్లు ఎత్తడంతో మూసీ నది మహోగ్రరూపం దాల్చింది. హైదరాబాద్ నగరంలో నదీ పరివాహక లోతట్టు ప్రాంత కాలనీలన్నీ నీటమునిగాయి. ఈ కాలనీల్లోని ప్రజలను ఎన్‌డిఆర్‌ఎఫ్, హైడ్రా బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. శుక్రవారం 12 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో, ఎన్నడూ లేనివిధంగా మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌ను కూడా వరద ముంచెత్తింది. ఎంజిబిఎస్ మార్గంలో మూసీపై ఉన్న రెండు వంతెనలు నీట మునిగాయి. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా వరద నీరు బస్ స్టేషన్లోకి చొచ్చుకురావడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. బస్ స్టేషన్‌లోని ప్రయాణికులను ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది రోప్ సహాయంతో బయటకు తరలించారు. అనంతరం బస్టాండ్‌ను మూసివేశారు. కర్నూలు మార్గంలో వచ్చే బస్సులను ఆరాంఘర్ వద్ద, విజయవాడ మార్గంలో వచ్చే బస్సులను ఎల్‌బి నగర్ వద్ద, కరీంనగర్ మార్గంలో వచ్చే బస్సులను జెబిఎస్ వద్ద, సంగారెడ్డి మార్గంలో వచ్చే బస్సులను పటాన్‌చెరు వద్ద నిలిపివేశారు. మూసీ నదిపై ఉన్న లోలెవలె వంతెనల పైనుంచి ట్రాఫిక్‌ను వెళ్లనీయకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా తీసుకున్నారు. శనివారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో కూడా వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది.

మూసీ పరివాహక ప్రాంతాల్లో రెడ్ అలర్ట్

మూసీ పరివాహక ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో పరిస్థితిని అంచనా వేసిన రెవెన్యూ, జిహెచ్‌ఎంసి, పోలీసు శాఖలు అప్రమత్తమయ్యాయి. ముఖ్యంగా చాదర్‌ఘాట్, శంకర్ నగర్, గోల్నాక డివిజన్ పరిధిలోని కృష్ణా నగర్, అంబేద్కర్ నగర్ ప్రాంతాల ప్రజలను అధికారులు సురక్షిత ప్రదేశాలకు తరలించారు. పాఠశాల భవనాలు, కమ్యూనిటీ హాళ్లను పునరావాస కేంద్రాలుగా మార్చి బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందిస్తున్నారు.

మైనింగ్‌లో రూ.వందల కోట్ల అవినీతి

- ఫిష్ ఆంధ్ర పేరుతో దోపిడి
- నివాసయోగ్యం కానిచోట్ల పేదలకు ఇళ్లస్థలాలు
- శాసనసభ ప్రశ్నోత్తరాల్లో సభ్యులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మైనింగ్‌లో అవినీతి, నివాసయోగ్యం కానిచోట ఇళ్లస్థలాలు కేటాయింపు అంశంపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యేలు కోరారు. శాసనసభ అసెంబ్లీ సమావేశాల ఎనిమిదో రోజు ప్రశ్నోత్తరాల్లో పలువురు సభ్యులు మాట్లాడారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లా పొదలకూరులో రుస్తుం, భారత్ మైనింగ్‌లో అక్రమ పేలుడు పదార్థాలు దొరికాయని తెలిపారు. దీనిపై ఆందోళన చేస్తుంటే తనపై హిజ్రాలు, రౌడీలను పంపించారని పేర్కొన్నారు. తాను ప్రధాన మంత్రి కార్యాలయానికి అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేశానని తెలిపారు. అయినా పోలీసులు తనను అరెస్టు చేశారేగానీ రుస్తుం, భారత్ మైనింగ్ కంపెనీలపై చర్యలు తీసుకోలేదని అన్నారు. మైనింగ్‌లో పాల్గొన్న ఒక్క వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకోలేదని తెలిపారు. అనంతరం కేంద్రానికి ఫిర్యాదు చేయడంతో విచారణ చేయాలని రాష్ట్రానికి సూచించిన తరువాత విచారణ జరిగిందని అన్నారు. వీటితోపాటు మట్టి విషయంలో రూ.300 కోట్లు అవినీతి జరిగిందని ఆరోపించారు. దీన్ని రికవరీ చేయాలని పేర్కొన్నారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఓబుళాపురం మైనింగ్ ఖనిజాన్ని నిల్వచేసి సిబిఐ సీజ్ చేసిన తరువాత కూడా వైసిపి నాయకులు తరలించారని ఆరోపణలు వచ్చాయని అన్నారు. ఇటువంటి వాటిని కాపాడే విషయంలో మంత్రి శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ బాలాజీ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పొదలకూరు మైనింగ్ వ్యవహారంపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఊరికి దూరంగా ఇళ్లస్థలాలు

కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ.. ఒకసెంటు పేదలకు స్థలం ఇచ్చి ఇళ్లు కట్టుకోమనడం అన్యాయమని తెలిపారు. అలాగే మూడుసెంట్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కోరారు. టిడ్కో ఇళ్లను కూడా బ్యాంకుల్లో తాకట్టు పెట్టారని పేర్కొన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఇళ్లస్థలాలు ఇచ్చారని అన్నారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. సత్తెనపల్లిలో కూడా నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో జగనన్న కాలనీలు ఇచ్చారని తెలిపారు. అప్పుడే స్థానికులు వద్దంటే బెదిరించారని వివరించారు. కడప ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ.. ఊరికి 15 కిలోమీటర్ల దూరంలో ఇళ్లస్థలాలిచ్చి ప్రజలను ఇబ్బంది పెట్టారని అన్నారు. ఆయా కాలనీల్లో నీటి సదుపాయం కూడా కల్పించలేదని పేర్కొన్నారు. దీనిపై గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ.. సభ్యులు లేవనెత్తిన సమస్యలన్నీ వాస్తవాలేనని, వాటిని సరిచేసే పనిలో ఉన్నామని వివరించారు. గృహ నిర్మాణానికి సంబంధించి లేఅవుట్లు ఊరికి దూరంగా ఉన్నాయని వివరించారు. అభివృద్ధి కాని లేఅవుట్లలో లబ్ధిదారులకు ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు.

కారవాన్ టూరిజం పాలసీ : మంత్రి దుర్గేష్

చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ.. చీరాల బీచ్‌లో చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ప్రజలు ఎక్కువ మంది వస్తున్నారని, మరిన్ని సదుపాయాలు కల్పిస్తే ఆదాయమూ వస్తుందని తెలిపారు. సూర్యలంక నుండి ఓడరేవు వరకూ కనెక్టివిటీ రోడ్డు ఏర్పాటు చేస్తే మరిన్ని అవకాశాలు వస్తాయని తెలిపారు. దీనిపై పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. చీరాల సమీపంలో వీరభద్రస్వామి పురాతన ఆలయాన్ని పరిరక్షిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి అభివృద్ధి చేయాలని ఆలోచన చేస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో 10 వేల హోమ్‌స్టే ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నామని వివరించారు. కారవాన్ టూరిజం పాలసీ తీసుకొస్తామని చెప్పారు.

ఫిష్ ఆంధ్ర పేరుతో దోపిడీ : వనమాడి

కాకినాడ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఫిష్ ఆంధ్ర పేరుతో గత ప్రభుత్వం పెద్దయెత్తున దోపిడీ చేసిందని అన్నారు. వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కేజ్ కల్చర్‌ను ప్రోత్సహించాలని కోరారు. రాజమండ్రి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ.. ఇన్‌ల్యాండ్ మత్స్యకారుల సంక్షేమాన్ని పట్టించుకోవాలన్నారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ.. మత్స్యకారుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విదేశాల్లో బందీలుగా ఉన్న మత్స్యకారులను విడుదల చేయిస్తున్నామని తెలిపారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ.. వైసిపి హయాంలో నంద్యాలలో విజయ డెయిరీని దెబ్బతీశారని పేర్కొన్నారు. దీన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని కోరారు.

మండలిలో బిల్లును అడ్డుకున్న వైసిపి

- రాజకీయ ప్రేరేపిత హత్యకు బిల్లుతేవడం సరికాదన్న బొత్స
- పెండింగ్‌లో ఉంచి సభను నిరవధిక వాయిదా వేసిన ఛైర్మన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును శాసనమండలిలో వైసిపి అడ్డుకుంది. పల్నాడు జిల్లాలో గత ప్రభుత్వంలో హత్యగావించబడ్డ తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం కల్పించే బిల్లును ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టారు. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రేరేపిత హత్యలో తోట చంద్రయ్య హత్యగావించబడ్డారని, అతని కుటుంబానికి బాసటగా నిలిచేందుకు ఈ బిల్లును తీసుకొస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. రాజకీయ ప్రేరేపిత హత్యలకు చట్టాలు చేసి ప్రభుత్వంలో శాశ్వత ఉద్యోగం కల్పించడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ బిల్లు ద్వారా రాబోయే కాలానికి, భవిష్యత్తు తరాలకు ఎలాంటి సందేశం ఇస్తారో ఆలోచించుకోవాలని సూచించారు. రాజకీయ ప్రేరేపితం అయితే పార్టీపరంగా సహాయం చేయాలని తెలిపారు. లేదంటే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో ఇవ్వొచ్చని, శాశ్వత ఉద్యోగం ఇవ్వడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చెప్పారు. మంత్రి కేశవ్ మాట్లాడుతూ.. తీవ్రవాదులు చంపిన కుటుంబాలకు కూడా గతంలో ఉద్యోగాలిచ్చిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయని తెలిపారు. బొత్స మాట్లాడుతూ.. ఉగ్రవాద సంఘటనలను రాజకీయ ప్రేరేపిత సంఘటనలకు ముడిపెట్టడం సరికాదన్నారు. హత్యను ప్రేరేపితం చేసిన వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని, లేదంటే పార్టీ పరంగా ఆర్థికంగా సహాయం చేయాలని సూచించారు. అధికారంలోకి రాగానే ప్రభుత్వ విధానాన్ని తెలియపరచాలని, ఈ కేసు ద్వారా బాసటగా నిలవాలనే ఉద్దేశంతో ఈ బిల్లు తీసుకొచ్చామని మంత్రి నారా లోకేష్ చెప్పారు. బొత్స మాట్లాడుతూ.. దీంతోపాటు పల్నాడు ప్రాంతంలో చాలా హత్యలు జరిగాయని, మరి వారికి ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. ఈ క్రమంలోనే పయ్యావుల, బొత్స మధ్య కొంత వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ సమయంలోనే హోంశాఖ మంత్రి వంగలపూడి అనితతోపాటు అధికార పార్టీకి చెందిన కొంతమంది సభ్యులు ఇష్టంలేకపోతే వాకౌట్ చేయవచ్చని చెప్పారు. దీనిపై మాట్లాడిన బొత్స తాము వాకౌట్ చేయబోమని, వాకౌట్‌ను ప్రేరిపిస్తే తాము డివిజన్ (ఓటింగ్) కోరుతామన్న ఆయన డివిజన్ పెట్టాలని డిమాండ్ చేశారు. తాము వాకౌట్ చేయడానికి సభకు రాలేదని, సమస్యలపై చర్చించేందుకు వచ్చామని తెలిపారు. మంత్రి హోదాలో ఉండి వాకౌట్ చేసుకోవాలని వ్యంగ్యంగా మాట్లాడతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పయ్యావుల మాట్లాడుతూ.. సుదీర్ఘ చర్చలు అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నామని, రాజకీయ ప్రేరేపిత హత్యలు, హింసలు తగ్గుతాయనే సంకేతం రాజకీయ పార్టీలకు దీనిద్వారా వెళ్తోందన్నారు.

ప్రతిపక్ష నేతనే ఈ బిల్లుపై పునరాలోచన చేసి ఆమోదించాలని కోరారు. ఈ బిల్లును వాయిదా వేసి పున:పరిశీలించి మరలా తీసుకురావాలని కోరారు. ఇప్పుడే ఆమోదం కావాలంటే మాత్రం తమకు ఓటింగ్ కావాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ జోక్యం చేసుకుని ప్రభుత్వం, ప్రతిపక్షం తమ అభిప్రాయాలు తెలుపుతూ సభ సజావుగా జరుగుతోందని, అనవసరంగా కొంతమంది దీనిపై జోక్యం చేసుకొని వాకౌట్ చేయాలని చెప్పడం సరికాదన్నారు. ఈ బిల్లును తరువాత తీసుకుంటానని పెండింగ్‌లో పెట్టి జిఎస్‌టి బిల్లును తీసుకున్నారు. అనంతరం సభ్యుల నుంచి ప్రత్యేక ప్రస్తావనలను స్వీకరించిన ఛైర్మన్ టీ విరామం ప్రకటించి సభను వాయిదా వేశారు. మరలా ప్రారంభమైన తరువాత బిల్లును పరిగణనలోకి తీసుకోకుండానే సభ నిర్వహణ వివరాలను చెప్పి నిరవధిక వాయిదా వేశారు.

అంతకుముందు రాష్ట్రంలో న్యాయ విద్య, పరిశోధనకు భారత అంతర్జాతీయ విశ్వవిద్యాలయం బిల్లు (ఇండియా యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఆఫ్ ద బార్ ఎట్ ద ఎపి బిల్లు-2025), ఎపి ప్రైవేట్ యూనివర్సిటీల స్థాపన, సవరణ బిల్లు, ఎపి విశ్వవిద్యాలయాల సవరణ బిల్లులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది. అదేవిధంగా రెవెన్యూశాఖ మంత్రి ప్రవేశపెట్టిన ఎపి వ్యవసాయ భూమి (వ్యవసాయ భూమి వ్యవసాయేతర భూమిగా మార్పు) బిల్లు-2025ను, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల టెన్నీస్ ప్లేయర్ మైనేని సాకేత్‌కు ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు ప్రవేశపెట్టిన బిల్లు, జిఎస్‌టి సవరణ బిల్లును సభ ఆమోదించింది.

హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం : బొత్స

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఎన్నో హామీలను విస్మరించిందని శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ విమర్శించారు. శాసనమండలి నిరవధికంగా వాయిదా వేసిన తరువాత శనివారం సాయంత్రం ఆయన అసెంబ్లీ బయట మీడియాతో మాట్లాడారు. 10 కీలకమైన హామీలిచ్చి మూడింటిని అరకొరగా అమలు చేసి సూపర్ హిట్ అని ప్రకటించుకుంటే సరిపోతుందా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేయడంతోపాటు బాధ్యతారాహిత్యానికి నిదర్శనం అన్నారు. రైతులు యూరియా కొరతతో ఇబ్బంది పడుతున్నా ఈ అంశంపై మండలిలో చర్చకు ప్రభుత్వం సిద్ధపడలేదన్నారు. మండలిలో సభ్యుల ప్రశ్నలకు తగిన సమాధానాలు ఇవ్వకుండా తప్పించుకునే ధోరణిని ప్రదర్శించిందని తెలిపారు. కార్మికుల పని గంటలు పెంచే బిల్లును విపక్షంగా తాము తీవ్రంగా వ్యతిరేకరించామని తెలిపారు. ఈ బిల్లును తాము ఆమోదించలేమని స్పష్టంగా చెప్పామన్నారు. క్రీడల్లో రాష్ట్రానికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన వ్యక్తికి ఉద్యోగం కల్పించే బిల్లుతోపాటు రాజకీయ కక్షలతో హత్యకు గురైన వ్యక్తి కుమారుడుకు ఉద్యోగం కల్పించే బిల్లులు ఒకేసారి తేవడం తగదన్నారు. క్రీడాకారుడుకు ఉద్యోగం ఇవ్వడం సబబే అయినా రాజకీయ కక్షలతో హత్యకు గురైన వ్యక్తి కుమారుడుకు ఉద్యోగం ఇస్తే ఇలా ఎంతో మందికి ఇవ్వాల్సి వస్తుందన్నారు. టిడిపి కార్యకర్తకు శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగం కోసం ప్రవేశపెట్టిన బిల్లును తాము వ్యతిరేకించామని ఆయన వివరణ ఇచ్చారు. బొత్స వెంట వైసిపి ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, ఇస్రాయిల్, కల్పలత, వరుదు కల్యాణి తదితరులు ఉన్నారు.

శ్రీనివాస్ భౌతికకాయన్ని సందర్శించి మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, చిత్రంలో జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

రోడ్డు ప్రమాదంలో ప్రజాశక్తి గన్నవరం విలేకరి మృతి

- పలువురు ప్రముఖులు, సిపిఎం శ్రేణులు నివాళి

ప్రజాశక్తి - ఉంగుటూరు

కృష్ణా జిల్లా గన్నవరం ప్రజాశక్తి విలేకరి నెక్కలపు శ్రీనివాస్ (52) శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గన్నవరం విమానాశ్రయం సమీపంలోని వికెఆర్ కళాశాల నుంచి ద్విచక్రవాహనంపై గన్నవరం వైపు వస్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఆయనను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. ఆయనకు భార్య ఉన్నారు. సాయంకాలం అంత్యక్రియలు నిర్వహించారు. వికెఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతూనే ఎస్‌ఎఫ్‌ఐలో పనిచేశారు. సుమారు నాలుగేళ్లపాటు ప్రజాశక్తిలో పేపర్ బోయ్‌గా తరువాత 1994 నుంచి ప్రజాశక్తి గన్నవరం విలేకరిగా 31 సంవత్సరాలుగా ఆ బాధ్యతను నిర్వహిస్తున్నారు.

శ్రీనివాస్ భౌతిక కాయాన్ని గన్నవరం ప్రభుత్వాస్పత్రి నుండి సిపిఎం శ్రేణులు, ప్రజాశక్తి సిబ్బంది, స్థానికులు ర్యాలీగా సిపిఎం కార్యాలయం వద్దకు తీసుకొచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు ఆయన భౌతికకాయంపై పార్టీ పతాకాన్ని కప్పారు. ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాసు, చీఫ్ జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు, జనరల్ మేనేజర్లు కె.హరికిషోర్, తోడరమల్లు, జి.శివరామకృష్ణ, గన్నవరం మండల పరిషత్ అధ్యక్షుడు అనగాని రవి, మాజీ సర్పంచ్ గూడపాటి తులసీమోహన్, సిపిఎం నాయకులు కాట్రగడ్డ రామచంద్రజోషి, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు, జర్నలిస్టులు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

పర్యాటకంలో 20 శాతం వృద్ధి రేటు లక్ష్యం

- ఆ రంగానికి పరిశ్రమ హోదా
- సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పర్యాటక రంగంలో 8 శాతంగా ఉన్న వృద్ధి రేటు 20 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం కార్యక్రమం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా బాపట్లలోని గోల్డెన్ సాండ్ రిసార్ట్‌ను సిఎం వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పర్యాటక స్వర్గధామంగా మార్చే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే శక్తి పర్యాటక రంగానికి ఉందని, దీనికి పరిశ్రమ హోదా కల్పించి ఆకర్షణీయమైన పాలసీతో ప్రత్యేక ప్యాకేజీలు, రాయితీలు అందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం టూరిజం ఆర్థిక వ్యవస్థలను శాసిస్తోందన్నారు. స్వర్ణాంధ్ర-2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దేశంలో అగ్రభాగాన నిలపాలని, ఇందులో పర్యాటక రంగం ప్రధాన పాత్ర పోషిస్తుందని తెలిపారు. పర్యాటకులను ఆకర్షించగలిగితే భారీగా ఆదాయం వస్తుందన్నారు. టెక్నాలజీ వల్ల ఉద్యోగాలు తగ్గుతాయనే భయాల నడుమ, పర్యాటక రంగంపై దృష్టి పెడితే భారీగా ఉపాధి కల్పన సాధ్యమని, రూ.1 లక్ష పెట్టుబడికి 10 ఉద్యోగాలు సృష్టించవచ్చని చెప్పారు. రాబోయే నాలుగేళ్లలో 50 వేల గదుల ఏర్పాటు చేయడమే లక్ష్యమని చెప్పిన ఆయన విశాఖ, అరకు, కోనసీమ, తిరుపతిలో 10,000కు పైగా హోం స్టేలను అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. విశాఖ, అరకు, రాజమండ్రి, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతిని యాంకర్ హబ్‌లుగా, కొండపల్లి, కూచిపూడి, ఏటికొప్పాక వంటి ప్రాంతాలను వారసత్వ కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. తిరుపతిలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తే అక్కడకు వచ్చే యాత్రికులు మూడు రోజులుండేలా చేయవచ్చని చెప్పారు. విజయవాడలో దసరా ఉత్సవాలను 'విజయవాడ ఉత్సవ్'గా ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రూ.451 కోట్లతో రిషికొండ భవనాలను నిర్మించిందని, ఆ డబ్బును పర్యాటకంలో పెట్టుబడి పెట్టి ఉంటే లక్షల ఉద్యోగాలు వచ్చేవని విమర్శించారు. రాజమండ్రిని టూరిజం హబ్‌గా మార్చేందుకు అఖండ గోదావరి ప్రాజెక్టు, హేవలాక్ బ్రిడ్జి ఆధునీకరణ చేపడతామని, విశాఖలో డబుల్ డెక్కర్ బస్సులు, క్రూయిజ్‌లను ప్రారంభించామని తెలిపారు. అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు లభించిందన్నారు. కార్యక్రమంలో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ, ఎమ్‌డి ఆమ్రపాలి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక పాలసీ 2024-29 ఆపరేషనల్ గైడ్‌లైన్స్, హోంస్టే పోర్టల్‌ను ఆవిష్కరించారు. హోంస్టే ప్రాజెక్టులపై గిరిజనులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు.

తిరుపతి జిల్లా యంత్రాంగానికి స్పీకర్ అభినందన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుపతిలో ఈనెల 14,15 తేదీల్లో జరిగిన అంతర్జాతీయ మహిళా సాధికారికత సదస్సును విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించిన తిరుపతి జిల్లా యంత్రాంగాన్ని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అభినందించారు. శాసనసభా వేదికగా శనివారం ఈ విషయాన్ని ప్రస్తావించిన ఆయన తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, జెసి శుభం బన్సల్‌తో పాటు తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు ఆరని శ్రీనివాసులు, పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డిలను ఆయన అభినందించారు.

స్వాగతం పలుకుతున్న రామ్మోహన్ నాయుడు

'అమృత్ భారత్'కు స్వాగతం

ప్రజాశక్తి- ఆమదాలవలస (శ్రీకాకుళం జిల్లా)
అమృత్ భారత్ రైలు.. దేశ రైల్వే రూపురేఖలు మార్చిందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌కు చేరుకున్న అమృత భారత్ రైలుకు ఆర్ఎం లలిత్ బొహ్రాతో కలిసి ఆయన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ ఈ రైలు ఒడిశాలోని బ్రహ్మపూర్ నుంచి గుజరాత్‌లోని ఉద్నా వరకు ప్రయాణిస్తుందని తెలిపారు. జిల్లాలో శ్రీకాకుళం, పలాసలో రెండు హాల్ట్‌లు ఇచ్చినట్టు తెలిపారు. గతంలో వందే భారత్ కూడా మూడు స్టాపులతో జిల్లాకు విశేషంగా ఉపయోగపడిందని గుర్తు చేశారు. విమానాల్లో ఉండే సదుపాయాలన్నీ అమృత్ భారత్ రైళ్లలో కూడా ఉన్నాయని తెలిపారు. జిల్లాలో నౌపాడ, పలాస, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం రోడ్డు స్టేషన్లను అమృత్ భారత్ పథకం కిందికి తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్‌డిఒ సాయిప్రత్యూష, డిసిసిబి అధ్యక్షులు శివ్వల సూర్యనారాయణ, జనసేన ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు పాల్గొన్నారు.

కురుబల అభ్యున్నతే లక్ష్యం

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
కురుబలను రాజకీయంగా, ఆర్థికంగా ఉన్నత స్థితికి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, ఇతర నాయకులు శనివారం కలిశారు. పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కురుబలకు అధిక ప్రాధాన్యమిచ్చారని చెప్పారు. కురుబల సమస్యలను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో కురుబ సంక్షేమ సంఘం నాయకులు బి ప్రసాద్, ఎం సదాశివ తదితరులు ఉన్నారు.

నేడు శ్రీవారి గరుడసేవ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో
శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి గరుడ వాహనసేవ నిర్వహించనున్నారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు పలువురు యాత్రికులు భారీగా తరలిరానున్నారు. దాదాపు మూడు లక్షల మంది యాత్రికులు వస్తారని, ఇందుకు తగ్గ ఏర్పాట్లు చేశామని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ అనీల్‌కుమార్ సింఘాల్ వెల్లడించారు. మూడువేల మందికి పైగా పోలీసు బందోబస్తు నిర్వహించనున్నారు. గరుడసేవ రోజు 450 బస్సులను అందుబాటులో ఉంచినట్లు ఆర్‌టిసి ఆర్ఎం జగదీష్ చెప్పారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారు నగరంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా శివారు ప్రాంతాల్లోనే వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశామని, అక్కడి నుంచి తిరుమలకు ఆర్‌టిసి బస్సులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. గరుడ సేవ కోసం వినియోగించే గొడుగులు చెన్నై నుంచి తిరుమలకు చేరుకున్నాయి. తొమ్మిది గొడుగులను టిటిడి ఛైర్మన్‌కు అందజేశారు. బ్రహ్మోత్సవాలల్లో భాగంగా శనివారం పండ్లు, పూలతో శ్రీవారిని అలంకరించారు.

జంటహత్య కేసులో విచారణకు పిన్నెల్లి సోదరులు

ప్రజాశక్తి - మాచర్ల (పల్నాడు జిల్లా)
పల్నాడు జిల్లాలోని వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామ సమీపంలో కొద్దినెలల క్రితం ఇద్దరు టిడిపి నాయకులు హత్యకు గురైన కేసులో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డి శనివారం విచారణకు హాజరయ్యారు. మాచర్ల రూరల్ సర్కిల్ పోలీసుస్టేషన్‌లో ఒక్కొక్కరినీ విడివిడిగా విచారించినట్లు సమాచారం.

ప్రజాభిప్రాయ సేకరణ వేదికపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం

అన్ని విధాలా ఆదుకోండి

- ఉద్యోగావకాశాలు, రూ.25 లక్షల ప్యాకేజీ ఇవ్వాలి
- ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్‌ప్లాంట్‌పై ప్రజాభిప్రాయ సేకరణలో నిర్వాసితులు
- ఇఐఎ రిపోర్టు తప్పుల తడక : సిపిఎం

ప్రజాశక్తి - నక్కపల్లి (అనకాపల్లి)
తమను అన్ని విధాలా ఆదుకోవాలని ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో నిర్వాసితులు కోరారు. ప్లాంట్ ఏర్పాటు కోసం తయారు చేసిన నివేదిక తప్పుల తడకగా ఉందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం తన అభిప్రాయాన్ని తెలిపారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో బుచ్చిరాజుపేట, చందనాడ, డిఎల్.పురం, రాజయ్యపేట, వేంపాడు గ్రామాల్లో ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా లిమిటెడ్‌కు కేటాయించిన 2120 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిపాదించబడిన 8.2 ఎంటిపిఎ (సాలిన మిలియన్ టన్నులు) సామర్థ్యం కలిగిన గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్ (ఐఎస్‌పి) ప్రాజెక్టు స్థాపన, అభివృద్ధి పనులకు ఎపి కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శనివారం చందనాడ గ్రామం (పాటిమీద) దగ్గర పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సును జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ నిర్వహించారు. ముందుగా ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవీంద్రనాథ్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. కాలుష్యాన్ని నియంత్రిస్తామని, 670 ఎకరాల్లో గ్రీన్‌బెల్ట్ ఏర్పాటు చేస్తామని, ఐదేళ్లలో రూ.168 కోట్లతో సామాజిక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణలో 40 మంది తమ అభిప్రాయాలను తెలిపారు. నివాస గృహాలు కోల్పోయిన నిర్వాసితుల కుటుంబాల్లో 18 సంవత్సరాలు నిండిన వారందరికీ రూ.25 లక్షల ఆర్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని, భూములు కోల్పోయిన రైతులతో పాటు, వాటిపై ఆధారపడ్డ కూలీలను, వివిధ వృత్తిదారులను, భూమిలేని కుటుంబాలను ఆదుకోవాలని, పెండింగ్‌లో ఉన్న డి పట్టా, సాగు భూములకు పరిహారం చెల్లించాలని, చెట్లకు కూడా పరిహారం ఇవ్వాలని నిర్వాసితులు కోరారు. మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి చీఫ్ ఇంజినీర్ సుదర్శన్, ఆర్అండ్ఆర్ అధికారి వివి రమణ, తహశీల్దార్ నరసింహమూర్తి పాల్గొన్నారు. 400 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

విశాఖ ఉక్కును సమాధి చేసి మిట్టల్ స్టీల్‌ప్లాంట్ నిర్మాణమా ? : కె.లోకనాథం

మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌పై ప్రజాభిప్రాయ సేకరణలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ ఆంధ్రుల హక్కు.. విశాఖ ఉక్కుకు సొంత గనులు సాధించకుండా ఏర్పాటేకాని మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కోసం గనులు కేటాయించాలని కూటమి ప్రజా ప్రతినిధులు ఉక్కు శాఖ మంత్రిని కలవడం శోచనీయమన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సమాధి చేస్తూ ప్రైవేటు మిట్టల్ స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి పూనుకున్నారని వివరించారు. 8.2 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి చేస్తే పర్యావరణ రక్షణకు 8 లక్షల మొక్కలు నాటాలని, దానికి 4 వేల ఎకరాల భూములు అవసరమని, అలాంటిది మొత్తం పరిశ్రమ భూమి 2020 ఎకరాలని, పర్యావరణ పరిరక్షణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, వైసిపి పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నేతలు

నేవీ ఆయుధ డిపోను నిర్మించొద్దు

- ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెంలో నిర్మించతలపెట్టిన నేవీ ఆయుధ డిపోను వెంటనే నిలుపుదల చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానం చేశారు. ఏలూరులోని అన్నే వెంకటేశ్వరరావు భవనంలో శనివారం ఎపి గిరిజన, ఆదివాసీ గిరిజన, రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్.రామ్మోహన్ మాట్లాడారు. జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో జనావాసాల నడుమ ఆయుధ డిపో నిర్మాణం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. నేవీ ఆయుధ డిపో నిర్మాణం కోసం ఏటా రెండు పంటలు పండుతున్న వ్యవసాయ భూములను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండిగా సేకరించడం దుర్మార్గమన్నారు. నేవీ ఆయుధ డిపోను నిర్మించొద్దని ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆయా సంఘాల నాయకులు ఆమోదం తెలిపారు.

ఎపి ఛాంబర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పి భాస్కరరావు, ఆర్ సుబ్బారావు

- ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా రాజశేఖర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ఎపి ఛాంబర్స్ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పొట్లూరి భాస్కరరావు, రావూరి సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన ఛాంబర్స్ జనరల్ బాడీ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఇప్పటి వరకూ ప్రధాన కార్యదర్శిగా ఉన్న బి రాజశేఖర్ ఎన్నికయ్యారు. ట్రెజరర్‌గా అక్కయ్యనాయుడు, సెంట్రల్ జోన్ వైస్ ప్రెసిడెంట్‌గా సిద్ధా సుధాకర్, విశాఖపట్నం జోన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎ లీలారాణిని ఎన్నుకున్నారు. రాయలసీమ జోన్ ఉపాధ్యక్షులుగా కెవి చౌదరి, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులుగా ఎం మోహన్ శ్యామ్‌ప్రసాద్, కె లక్ష్మీనారాయణ, ఎవి సుబ్రహ్మణ్యం, చిట్టూరి శ్రీనాథ్, జె సుబ్బారావు, పిఎల్ హనుమంతరావు, గుర్జీత్‌సింగ్ సహాని ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఇలకు విడుదల చేయాల్సిన ఇన్సెంటివ్‌లను ఇప్పించడం ద్వారా వాటిని బలోపేతం చేస్తానన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా ఉత్పత్తి ఖర్చును తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. పరిశ్రమల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతామని వివరించారు. ఎపి ఛాంబర్స్‌కు 30 వేల చదరపు అడుగుల నూతన కార్పొరేట్ కార్యాలయం నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణపై ఉద్యమం

- ఎస్ఎఫ్ఐ ఆలిండియా సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్
- విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి : రామ్మోహన్, ప్రసన్నకుమార్
- భీమవరంలో ముగిసిన రాష్ట్ర విద్యార్థినుల కన్వెన్షన్

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి)
రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం పిపిపి విధానం తీసుకొచ్చి మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు పూనుకుందని, దీనికి వ్యతిరేకంగా ఉద్యమించడానికి విద్యార్థి లోకం సన్నద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ ఆలిండియా సహాయ కార్యదర్శి ఐషీఘోష్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ వసతి గృహాల్లో కనీస వసతులు కల్పించలేని పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉండడం సిగ్గుచేటన్నారు. నూతన విద్యా విధానంతో ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యమైపోతోందని, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు నడుం బిగించాల్సిన అవసరం ఉందన్నారు. రెండు రోజుల పాటు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం అంబేద్కర్ భవనంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్యార్థినుల కన్వెన్షన్ శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా ఐషీఘోష్ ప్రారంభోపన్యాసం చేశారు. వైద్యం, వైద్య విద్య ప్రభుత్వ ఆధీనంలో ఉంటే పేద, మధ్యతరగతి విద్యార్థులకు, ప్రజలకు విద్య, వైద్యం అందుతుందని చెప్పారు. ఆంధ్ర యూనివర్సిటీ విద్యార్థి మృతి అంశాన్ని రాజకీయం చేస్తున్నారనడం దారుణమని, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని అన్నారు. మనుధర్మం పేరుతో విద్యా వ్యవస్థను పూర్తిగా వక్రీకరించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలు ఇప్పటికీ కొన్ని అద్దె భవనాల్లోనే ఉన్నాయని, సౌకర్యాలు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మెస్‌ఛార్జీలు పెంచి, పౌష్టికాహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ సిహెచ్.పావని, కో-కన్వీనర్లు జ్యోతి, రాష్ట్ర నేతలు చిన్ని, నవిత, అమూల్య, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.గణేష్, టి.ప్రసాద్ పాల్గొన్నారు.

భీమవరంలో ప్రదర్శన చేస్తున్న విద్యార్థి సంఘం నేతలు, విద్యార్థినులు

విద్యార్థినుల భారీ ప్రదర్శన

రాష్ట్ర విద్యార్థినుల కన్వెన్షన్ ముగింపులో భాగంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భీమవరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రం నలు మూలల నుంచి విచ్చేసిన సుమారు 300 మంది విద్యార్థినులు, విద్యార్థి సంఘ నేతలు ప్రదర్శనలో పాల్గొన్నారు. పాత బస్టాండ్ సెంటర్‌లో ప్రారంభమైన ప్రదర్శన గాంధీ చౌక్, అంబేద్కర్ సెంటర్ మీదుగా ప్రకాశం చౌక్ వరకూ సాగింది. అక్కడ అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఐషీఘోష్, ప్రసన్నకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీస్ బొమ్మ సెంటర్, అన్నపూర్ణ థియేటర్ రోడ్డు, కొత్త బస్టాండ్ సెంటర్ మీదుగా వీరమ్మ పార్క్ మీదుగా అంబేద్కర్ భవనం వరకు ప్రదర్శన సాగింది.

మరింతగా పట్టణీకరణ

- విస్తృత కసరత్తు చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి
జిఎస్‌డిపి మెరుగుపరచుకునేందుకు పట్టణీకరణకే ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసం ప్రత్యేక కార్యాచరణ కూడా సిద్ధం చేస్తోంది. గ్రామీణ ప్రాంతాలను పట్టణ ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు ప్రారంభిస్తోంది. దీనికోసం పరిశ్రమల స్థాపన, పంచాయితీల విలీనం, పంచాయితీల స్థాయి పెంపు వంటి అంశాలను పరిశీలిస్తోంది. దీనికోసం అవసరమైన కసరత్తు చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు కూడా సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో 36 శాతం పట్టణ ప్రాంతం ఉంది. 2047 నాటికి దీనిని 60 శాతానికి పెంచేందుకు లక్ష్యంగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ప్రణాళిక శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందుకు అనేక కోణాల్లో కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు వారు చెబుతున్నారు. ప్రధానంగా పంచాయితీలను నగర పంచాయితీలుగా మార్చడం, కొన్నింటిని మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో విలీనం చేయడం వంటి, మరికొన్ని పంచాయితీలను కలిపి ఉడా (అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)లుగా అభివృద్ధి చేయడం వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నారు. వాస్తవానికి గతంలోనే పట్టణీకరణకు కీలక మార్గదర్శ కాలను జారీ చేశారు. పట్టణీకరణ తరువాత ఆయా ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికన కనీసం 20 నుంచి 40 వేల మంది వరకు ఉండాలని, ప్రతి చదరపు కిలోమీటర్‌కు 400 మందితో జనసాంద్రత ఉండాలని ఆ మార్గదర్శకాల్లో సూచించిన సంగతి తెలిసిందే. అలాగే ఆ ప్రాంతంలో నివసిస్తున్న వారిలో 25శాతం వరకు ప్రజలు వ్యవసాయేతర కార్యక్రమాల్లో ఉపాధి పొందుతుండాలని, అక్కడ పరిశ్రమలను భారీగా ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకోవాలని కూడా నిర్దేశించారు. పట్టణీకరణ విధానాన్ని విస్తృతం చేసేందుకుగాను భూసేకరణ అవకాశాలను కూడా పెంచాలని పేర్కొన్నారు.

ఆదాయం కోసమేనా...?

ఆదాయాన్ని పెంచుకోవడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఈ చర్య తీసుకుంటోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పల్లెలతో పోలిస్తే పట్టణాల్లో వివిధ రకాల పన్నులు, సేవల రుసుములు ఎక్కువన్న సంగతి తెలిసిందే. మౌళికవసతుల ఏర్పాటు సంగతి ఎలా ఉన్నప్పటికీ తక్షణం ఖజానాను నింపుకునే అవకాశం ఉండటంతో ఆ దిశలో ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు భావిస్తున్నారు.

వేలేరుపాడు మండలం రుద్రంకోట నుంచి బోటుపై ప్రజలను దాటిస్తున్న అధికారులు

గోదావరికి మళ్లీ వరద

- భద్రాచలంలో మొదటి ప్రమాద హెచ్చరిక
- శ్రీశైలం పది గేట్లు ఎత్తివేత

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి
గోదావరికి మళ్లీ వరద వచ్చింది. భద్రాచలం వద్ద 44.60 అడుగుల నీటిమట్టం నమోదైంది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. శనివారం అర్ధరాత్రి తర్వాత ప్రవాహం పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రాచలం నుంచి వస్తున్న ప్రవాహాన్ని అంచనా వేసుకుని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కాటన్ బ్యారేజీకి చెందిన 175 గేట్ల ద్వారా 9.77 లక్షల క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

ఏలూరు జిల్లా కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్ వే పైకి వరదనీరు చేరడంతో వాగు అవతల ఉన్న 12 గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగు కాజ్ వే పైకి వరదనీరు చేరడంతో మూడు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వేలేరుపాడు నుంచి రుద్రంకోట, రేపాక గొమ్ము ప్రధాన రహదారులు నీట మునగడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలను అధికారులు పడవలపై అటువైపునకు దాటిస్తున్నారు. ఎటపాక మండలంలోని మురుమూరు, నెల్లిపాక - వీరాయిగూడెం, కన్నయ్యగూడెం - గట్టుగూడెం రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి. విఆర్.పురం మండలం ఒడ్డుగూడెం, శ్రీరామగిరి, ఇప్పూరు, అడవి వెంకన్నగూడెం, తుష్టివారిగూడెం, చింతరేగుపల్లి, కన్నాయిగూడెం ప్రాంతాలకు రాకపోకలు స్తంభించాయి. పోలవరం ప్రాజెక్టు నుంచి 10,13,149 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు జలవనరులశాఖాధికారులు చెప్పారు. ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం 12.180 మీటర్లు నమోదైనట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

శ్రీశైలానికి పోటెత్తిన వరద

శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతోంది. ఎగువ జూరాల నుంచి 4,63,982 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 43,110 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 3,750 క్యూసెక్కుల కలిసి శ్రీశైలం జలాశయానికి 5,10,842 క్యూసెక్కులు వస్తున్నాయి. బ్యారేజీ పది గేట్లను 18 అడుగులు మేరకు ఎత్తి 4,26,160 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

దీక్షలను ప్రారంభిస్తున్న వైసిపి మాజీ ఎమ్మెల్యే , జిల్లా అధ్యక్షులు ఎస్‌వి.మోహన్‌రెడ్డి

హైకోర్టు భిక్ష కాదు... హక్కు

- కర్నూలులో హైకోర్టు సాధన సమితి నిరాహారదీక్ష

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్
హైకోర్టు రాయలసీమ వాసులకు భిక్ష కాదు... వారి హక్కు అని పలువురు నాయకులు అన్నారు. హైకోర్టు సాధన సమితి ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద శనివారం కర్నూలు జిల్లా న్యాయవాదులు నిరాహార దీక్ష నిర్వహించారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా అధ్యక్షులు సింగరాజు లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ దీక్షలకు కర్నూలు నగర మేయర్ బివై.రామయ్య, వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్‌వి.మోహన్ రెడ్డి, కోడుమూరు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సతీష్, పిపిఎస్ఎస్ రాష్ట్ర నాయకులు ఇ.పుల్లారెడ్డి, ప్రజా పరిరక్షణ వేదిక నాయకులు శివశంకర్ రెడ్డి, సీనియర్ అడ్వకేట్ మురళి, వెంకటస్వామి, చంద్రుడు తదితరులు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ హైకోర్టు కోసం న్యాయవాదులు 130 రోజులు పోరాటాన్ని నిరాటంకంగా కొనసాగించారని అది లాయర్ల పోరాట స్ఫూర్తికి నిదర్శనమని అన్నారు. తాము అధికారంలోకి వస్తే హైకోర్టు బెంచిని ఏర్పాటు చేస్తామని టిడిపి ఎన్నికల్లో హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. నేడు జిల్లాకు బెంచ్ లేదు, కుర్చీ లేదని ఎద్దేవా చేశారు. హైకోర్టు సాధించేవరకు తాము లాయర్లకు అండగా ఉంటామని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లాయర్లు రాజేష్, అంగడి లక్ష్మన్న, నాగవేణి, సోమ సుందరం, సుందరయ్య విజ్ఞాన కేంద్రం నాయకులు ధనుంజయ, పిపిఎస్ఎస్ నాయకులు వెంకటేశ్వర్లు, సివివర్మ, లక్ష్మన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు జాతి, భాష అస్థిత్వాన్ని పరిరక్షించుకోవాలి

తెలకపల్లి రవిని సత్కరిస్తున్న ఎంవిఎస్ శర్మ, సాహితీవేత్తలు

- జాషువా జయంతి సభలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ
- తెలకపల్లి రవికి జాషువా కవితా పురస్కారం ప్రదానం

ప్రజాశక్తి - గుంటూరు
ప్రపంచీకరణ పోటీ యుగంలో తెలుగు జాతి అస్థిత్వం, తెలుగు భాష పరిరక్షణకు ప్రజలు మరో సంస్కరణ ఉద్యమానికి సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ పిలుపునిచ్చారు. తెలుగు సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఆధ్వర్యంలో శనివారం గుంటూరులో జాషువా జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ జర్నలిస్టు, విశ్లేషకులు, సాహితీవేత్త తెలకపల్లి రవికి జాషువా కవితా పురస్కారం అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ కుల వివక్షత, మతతత్వం, స్త్రీల హక్కుల అణచివేత, శ్రమ దోపిడీ ఇలా అన్ని విషయాల్లోనూ జాషువా తన ధర్మాగ్రహాన్ని కవిత్వం ద్వారా వ్యక్తం చేశారని వివరించారు. కానీ నేడు తెలుగు జాతి అస్థిత్వం, భాష కనుమరగయ్యే పరిస్థితులు వచ్చినా పాలకుల్లో స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో తిరోగమన భావాలు ప్రచారంలో ఉన్నాయన్నారు. అభ్యుదయవాదులు, సాహితీ సంస్థలు ఈ విషయం గురించి ఆలోచించాలని కోరారు. రాబోయే వందేళ్లకు కావాల్సిన మానవత్వ విలువలు జాషువా పద్యంలో కనిపిస్తాయని, కానీ నేటి తరానికి తేట తెలుగు అర్థం కావట్లేదని అన్నారు. ప్రభుత్వాలు తెలుగును నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. తెలుగు నేలపై కందుకూరి, గురజాడ వంటివారు వేసిన బాటను జాషువా మరింత విస్తృతపరిచారని, అటువంటి తెలుగు సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని, అభ్యుదయ భావజాలానికి, సాంస్కృతిక కేంద్రమైన గుంటూరు నుండే ఆ కృషి ప్రారంభం కావాలని ఆకాంక్షించారు. తెలకపల్లి రవి మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న కులం, మతం వంటి సామాజిక నియమాల్లోని వాస్తవాలను గుర్తించాలంటే ఆ నియామాలను తలకిందులుగా చూడాలని జాషువా సాహిత్యంలో చెప్పారని గుర్తు చేశారు. అనంతరం జాషువా సాహితీ పురస్కారాన్ని తెలకపల్లి రవికి అందచేసి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎసి కాలేజి మాజీ ప్రిన్సిపల్ పి.ముత్యం ప్రసంగించగా, జాషువా విజ్ఞాన కేంద్ర మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు విజ్ఞాన కేంద్రం చేపడుతున్న విభిన్న కార్యక్రమాలను, భవిష్యత్ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్, జనచైతన్య వేదిక అధ్యక్షులు లక్ష్మణరెడ్డి, జాషువా విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎన్.కాళిదాసు, కార్యక్రమాల నిర్వహణ బాధ్యులు ఎన్.భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విపంచి పుస్తకావిష్కరణలో ఎమ్మెల్సీ ఆలపాటి, నిర్వాహక బృందం

తెనాలిలో వీణ అవార్డ్స్ నాటకోత్సవాలు ప్రారంభం

- నాటకాల సమాహారం 'విపంచి' ఆవిష్కరణ

ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు జిల్లా)
రంగస్థల వైభవానికి పట్టుగొమ్మ ఆంధ్రా ప్యారిస్ తెనాలి అని ఎంఎల్‌సి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో పట్టణానికి చెందిన కళల కాణాచి, ఆర్ఎస్ఆర్ గ్రీన్ వే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వీణ అవార్డ్స్ నాటక, నాటిక ప్రదర్శనలు శనివారం ప్రారంభమయ్యాయి.

కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న నాటకోత్సవాల్లో ఐదు పద్య నాటికలు, ఐదు సాంఘిక నాటకాలు, ఏడు సాంఘిక నాటికలు ప్రదర్శిస్తున్న నేపథ్యంలో వాటి సమాహారంతో రూపొందించిన 'విపంచి' పుస్తకావిష్కరణకు కృష్ణ - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలల కాణాచి సంస్థ అధ్యక్షులు బుర్ర సాయిమాధవ్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్సీ మాట్లాడారు. తొలిరోజు నాటకోత్సవాలు పట్టణ రంగస్థలం కళాకారుల సంఘం అధ్యక్షులు బుర్రా విజయలక్ష్మి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమయ్యాయి. నాటకోత్సవాల ప్రారంభం సందర్భంగా నిర్వహించిన సభకు ఎపి నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు.

వెలువడినది



రాజకీయ పరిణామాలపై నివేదిక

2025 సెప్టెంబర్ 13-15 తేదీలలో న్యూఢిల్లీలో జరిగిన పార్టీ కేంద్ర కమిటీ సమావేశం ఆమోదించినది.

రూ. 10/-

ప్రతులకు
ప్రజాశక్తి బుక్‌హౌస్
డోరు నెం.27-1-54, కారల్‌మార్క్స్‌రోడ్, విజయవాడ - 2
ఫోన్ : 9490099061, 9490099057

బ్రాంచీలు
విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు

సంపాదకీయం

హితవు!

'కుటుంబం తొలి దేవాలయం' అంటాడు టాల్‌స్టాయ్. అమ్మ జోల, నాన్న లాల మనిషి జీవితంలో మొదటి పాఠం. అమ్మ చేతి ముద్దలు తింటూ...నాన్న చేయి పట్టుకుని అడుగులేస్తూ నేర్చుకునేది బాధ్యత. వారి మాటలలో దాగిన విలువలు, వారి చూపులలో మెరిసే ఆప్యాయత... మనిషి జీవితానికి మూలధనం. ఎంత ఎదిగినా ఈ జీవిత పాఠాలే దారిచూపే వెలుగు దివ్వెలు. 'మాతృ దేవోభవ, పితృ దేవోభవ' అంటూ తరతరాలుగా మన సమాజాన్ని నడిపించిన విలువల పునాది తల్లిదండ్రులు. నేటి ఆధునిక సమాజంలో ఆ విలువలు మసకబారుతున్నాయి. గ్లోబలైజేషన్ తెచ్చిన వేగంలో మన జీవనశైలిలోను, జీవితంలోనూ అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ బలహీనమై, 'అణు'బంధాలుగా విచ్ఛిన్నమైపోతున్నాయి. నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యలు, తల్లిదండ్రులు వంటి బంధాలు 'అడ్డంకి' అనే ధోరణి పెరిగింది. 'భారతదేశపు ప్రధాన బలం...కుటుంబ వ్యవస్థ' అంటారు గాంధీజీ. ఈ కుటుంబ వ్యవస్థ గ్లోబలైజేషన్ ప్రభావంతో కుదుపులకు లోనవుతోంది. విద్య, ఉద్యోగం, జీవనశైలిలో చోటుచేసుకున్న మార్పులు పిల్లలపై ఒత్తిడి పెంచుతున్నాయి. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల బాగోగులు చూసుకుంటామని హామీనిచ్చి, వారి నుంచి ఆస్తి పొందిన బిడ్డలు మాట తప్పుతున్నారు. 'ఒక సమాజం యొక్క నిజమైన కొలమానం... ఆ సమాజం తమ పెద్దలను ఎలా గౌరవిస్తుందన్న దానిపైనే ఆధారపడి వుంటుంది' అంటారో తత్వవేత్త.

తాజాగా, వృద్ధులైన తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలకు వారి ఆస్తులను అనుభవించే హక్కు లేదని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. అలా ప్రవర్తించే పిల్లల్ని బయటకు వెళ్లగొట్టొచ్చని తేల్చిచెప్పింది. బిడ్డల నిరాదరణకు గురయ్యే తల్లిదండ్రులకు 'తల్లిదండ్రుల, వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం' అండగా నిలుస్తుందని వ్యాఖ్యానించింది. ఈ చట్టం ప్రకారం... ఏర్పాటైన ట్రిబ్యునళ్లు తల్లిదండ్రులను పట్టించుకోని బిడ్డల విషయంలో సత్వర విచారణ జరుపుతాయని కూడా స్పష్టం చేసింది. తల్లిదండ్రులు తమ పిల్లలకు బదిలీ చేసిన ఆస్తులను తిరిగి బాధితులకు దక్కేలా ఆదేశించే అధికారం ట్రిబ్యునళ్లకు వుంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. మహారాష్ట్రకు చెందిన ఓ వృద్ధ జంట సుప్రీంకోర్టును ఆశ్రయించగా... సుప్రీంకోర్టు ఈ సంచలనాత్మకమైన తీర్పును వెలువరించింది. జన్మనిచ్చిన తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ బాధ్యత వారి కుమారులు, కుమార్తెలదేనని గతంలోనూ కోర్టు ఈ తరహా తీర్పునిచ్చింది. 'తల్లిదండ్రులను గౌరవించని సమాజం నిలవదు' అంటాడు కన్ఫ్యూషియస్. ప్రపంచీకరణ వల్ల వస్తున్న సాంస్కృతిక మార్పులు ఆర్థికాభివృద్ధిని తెచ్చినా, ఆ అభివృద్ధి మానవీయ విలువలను మసకబార్చకూడదు. జన్మనిచ్చిన వారే మన భవిష్యత్‌కు మార్గదర్శకులు. వారిని వదిలేసి...ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎంత సంపాదించినా మనిషితనాన్ని కోల్పోవడమే. ఇప్పుడు 'జీవితం ఒక ప్రయాణం కాదు, అదొక పరుగు పందెం'. ఈ పందెంలో గెలవాలేగాని గెలిచి ఓడకూడదు.

'లోకమందు మాతాపితలు మిత్రుడును... వీరు ముువ్వురే హితులు. తక్కిన వారందరూ ప్రయోజనమును బట్టి హితులగుచుందురు' అంటారు చిన్నయసూరి. మన హితం కోరే తల్లిదండ్రుల సంరక్షణ... కేవలం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాదు. భారతీయ సమాజంలో అనాదిగా వచ్చిన ఒక గౌరవనీయ సంస్కృతి. జీవిత చరమాంకంలో ఇవాళ వృద్ధులను వదిలేస్తే... 'నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష' అన్నట్లుగా రేపు అదే పరిస్థితి మనకూ ఎదురవుతుంది. మన తల్లిదండ్రులకిచ్చే గౌరవాన్ని బట్టే... మన పిల్లలు మనల్ని గౌరవిస్తారు. పిల్లలను సోషల్ మీడియాలో కాకుండా బంధాల మధ్య, అనుబంధాలను పెంచుకునేలా పెంచాలి. పుస్తకాలు చదివించాలి. పండుగల వంటి సందర్భాల్లో కుటుంబమంతా ఉమ్మడిగా జరుపుకోవాలి. అది పిల్లల్లో ఐక్యతను, బంధాన్ని పెంచుతుంది. గ్లోబలైజేషన్ మన ఇంటి గోడలను విరచగలదు. కానీ, బంధాలను, విలువలను కాపాడగలిగితే, ఆ గోడలు మన ప్రపంచానికి ద్వారాలవుతాయి. 'ఇల్లు ఒక స్థలం మాత్రమే కాదు... అదొక అనుభూతి' అంటారు అమెరికన్ నటి, సామాజిక కార్యకర్త సిసిలీ థెరన్. ఏది విత్తితే... అదే మొలుస్తుంది. కనుక, ఈ భావనను కాపాడుకోవడం మన చేతుల్లోనే వుంది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు... సమాజానికొక గుణపాఠం కావాలి. విలువల పునరుద్ధరణకొక మేల్కొలుపు కావాలి.

మహనీయుల మాట

అణచివేతను ప్రతిఘటించడమే నిజమైన దేశభక్తుడి బాధ్యత. స్వాతంత్ర్యాన్ని ఎవరూ ఇవ్వరు. ధైర్యంతో, త్యాగంతో దాన్ని తీసుకోవాలి. ఆలోచన, మాట, పని... ఈ మూడింటిలోనూ స్వేచ్ఛ వున్నప్పుడే మనిషి స్వతంత్రంగా వున్నట్లు.

మేడమ్ కామా,
స్వాతంత్ర్య సమరయోధురాలు.

ఇ.సి విన్యాసాలతో విశ్వసనీయత సాధ్యమా?

ప్రస్థానం

భారత ఎన్నికల సంఘం (ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా) విశ్వసనీయత కోల్పోతున్నదని ప్రపంచ వ్యాపితంగా మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. బీహార్‌లో 'సర్' తతంగంతో మొదలైన ఈ చర్చ ఇటీవల కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కర్ణాటకకు సంబంధించి ముందుకు తెచ్చిన వాస్తవాలతో మరింత తీవ్ర రూపం దాల్చింది. ఇందుకు సమాధానం ఇవ్వకపోగా ఇ.సి రాహుల్ గాంధీపైన దాడి ప్రారంభించింది. గడువులు విధించి బెదిరింపులకు దిగింది. మరో వైపున బిజెపి అధినేతలు అధికార ప్రతినిధులు ఇ.సి కన్నా తీవ్రంగా దాన్ని సమర్థించే పని మొదలుపెట్టారు. ఆ విధంగా అనుమానాలకు ఆజ్యం పోస్తున్నారు. ఉదాహరణకు ఇటీవల లండన్ పర్యటన సందర్భంలో రాహుల్ ఫైనాన్షియల్ టైమ్స్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ మొదటిసారిగా దేశంలో ఎన్నికల ప్రక్రియ సందేహాస్పదమై పోయిందనీ, ప్రజల ఆమోదం లేనివారు అధికారం చేపట్టడానికి సాధనమవుతున్నదనీ విమర్శించారు. ఆ వెంటనే బిజెపి నేతలు ఇది దేశ వ్యతిరేకమైన చర్యగా ధ్వజమెత్తారు. ఓట్ చోర్, ఓట్ చోర్‌కీ చౌకీదార్, ఓటు దొంగలకు ఇ.సి రక్షణ వంటి ఆయన నినాదాలు రాజకీయ సంచలనానికి దారితీస్తుంటే అటు బిజెపి రాజకీయంగానూ ఇ.సి చట్ట భాషలోనూ ఎదుర్కోవడానికి తంటాలు పడుతున్నాయి. వాస్తవానికి ఎన్నికల సంఘం ఏం చేసినా అన్ని పార్టీలనూ కలుపుకొని, చర్చించి చేయవలసి వుంటుంది. కానీ ప్రస్తుతం అలాంటివేమీ లేకుండా కేవలం ఏకపక్షంగా ముందుకు పోతున్నది. బిజెపి తప్ప మిగిలిన అన్ని పార్టీలూ వ్యతిరేకిస్తున్నాయంటేనే అది ఎవరికి మేలు చేసే విధంగా వుందో అర్థమైపోతుంది. ఆఖరుకు ఆరెస్సెస్ కూడా మరింత బాహాటంగా ఇ.సి ని వెనకేసుకు వచ్చింది. దేశంలో జనాభా పొందిక మారిపోకుండా చూడటంలో ఇ.సి పాత్ర కీలకమైందని ప్రశంసలు కురిపించింది. కానీ ప్రతిపక్షాల పైన ఇలాంటి ఎన్ని దాడులు చేసినా ఇ.సిపై విమర్శలు ఆగకపోగా కొత్త కొత్త ఆధారాలు లభిస్తున్నాయి. కర్ణాటకలోని మహదేవ్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గంలో ఓట్ల తొలగింపునకూ బిజెపి విజయానికి సంబంధం వుందని రాహుల్ వాదించారు. అలాగే అలంద్ నియోజకవర్గంలో 6018 ఓట్ల తొలగింపు కోసం కుట్రపూరితంగా దరఖాస్తులు అందాయని ఆయన సాక్ష్యాధారాలు మీడియాకు అందజేశారు. కాంగ్రెస్ అక్కడ అధికారంలో వుంది గనక తాము కోరినా ఇ.సి నుంచి సరైన సమాధానం రాలేదని కూడా వెల్లడించారు.

తెలకపల్లి రవి

వాస్తవానికి ఎన్నికల సంఘం ఏం చేసినా అన్ని పార్టీలనూ కలుపుకొని, చర్చించి చేయవలసి వుంటుంది. కానీ ప్రస్తుతం అలాంటివేమీ లేకుండా కేవలం ఏకపక్షంగా ముందుకు పోతున్నది. బిజెపి తప్ప మిగిలిన అన్ని పార్టీలూ వ్యతిరేకిస్తున్నాయంటేనే అది ఎవరికి మేలు చేసే విధంగా వుందో అర్థమైపోతుంది. ఆఖరుకు ఆరెస్సెస్ కూడా మరింత బాహాటంగా ఇ.సి ని వెనకేసుకు వచ్చింది. దేశంలో జనాభా పొందిక మారిపోకుండా చూడటంలో ఇ.సి పాత్ర కీలకమైందని ప్రశంసలు కురిపించింది. కానీ ప్రతిపక్షాల పైన ఇలాంటి ఎన్ని దాడులు చేసినా ఇ.సిపై విమర్శలు ఆగకపోగా కొత్త కొత్త ఆధారాలు లభిస్తున్నాయి.

బాధ్యతా రాహిత్యం

దీనిపై జరగాల్సిందేమిటి? స్వతంత్ర ఎన్నికల పరిశీలకుడు యోగేంద్ర యాదవ్ చక్కగా వివరించారు. మీ యంత్రాంగం లోపభూయిష్టంగా వుంది. తప్పు పేరుతో లేని ఫోన్ నెంబర్‌తో ఒక వ్యక్తి వేల ఓట్ల తొలగింపు కోరవచ్చునని తేలింది. ఆ పని చేసిన వ్యక్తి ఎవరో, పూర్వాపరాలేమిటో తేల్చడానికి ఇ.సి ఎందుకు సహకరించడంలేదు? అని యాదవ్ ప్రశ్నించారు. ఆన్‌లైన్ ద్వారా ఏ వ్యక్తీ ఓట్ల తొలగింపు చేయలేడని ఎన్నికల సంఘం చెబుతున్న మాట ఎంతవరకూ సరైందో తేల్చడం ఎలా? ఒకవైపున మేమే ఈ విషయంలో మొదట ఫిర్యాదు చేశామని ఇ.సి అంటున్నది. ఏ తప్పూ జరక్కపోతే మీరెందుకు ఫిర్యాదు చేయాల్సి వస్తుంది? అని యాదవ్ నిలదీస్తున్నారు. మీరు ఎఫ్ఐఆర్ దాకా వెళ్లి వుంటే రాష్ట్ర సిఐడి 18 లేఖలు రాసినా ఎందుకు జవాబివ్వలేదు? ఆ వివరాలు పంచుకోవడానికి అభ్యంతరమేమిటి? అంటూ యోగేంద్ర యాదవ్ గుప్పిస్తున్న ప్రశ్నలు అర్థవంతమైనవి. తోసిపుచ్చలేనివి. ఆ దొంగ దరఖాస్తులు ఏ నెంబర్ నుంచి వచ్చాయో చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపైనే వుందన్నది నిస్సందేహం. రాహుల్ గాంధీపై రాజకీయ దాడి చేసినా, రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘం పవిత్రత గురించి బిజెపి సుద్దులు చెప్పినా ఎవరూ తీవ్రంగా తీసుకోరు. ఎందుకంటే సుప్రీంకోర్టుతో సహ అన్ని రాజ్యాంగ వ్యవస్థలపైన రోజూ దాడి చేస్తున్నది బిజెపినే. ఈ మధ్యనే ఉపరాష్ట్రపతి విషయంలో కూడా ఏం చేశారో చూశాం.

సందేహాలతోనే 'సర్'

కర్ణాటక కన్నా ముందు బీహార్‌లో 'సర్' తతంగంతో ఈ వివాదం మొదలైంది. వాస్తవానికి రాజ్యాంగంలో 'సర్' ఊసే లేదు. ఎన్నికల సంఘం నిబంధనల్లోనూ 'సర్'కు ఇంత ప్రాధాన్యత లేదు. బీహార్ 'సర్'పై సుప్రీంకోర్టు కూడా సందేహాలు సవాళ్లు లేవనెత్తింది. నెల రోజుల లోపు 11 పత్రాల్లో ఒకటి చూపిస్తేనే ఓటు హక్కు నిలబడుతుందని బెదిరించిన ఇ.సి ఆధార్ కార్డును ఎందుకు తీసుకోలేదు? ఒకటికి రెండుసార్లు అత్యున్నత న్యాయస్థానం వెంటపడిన తర్వాతనే ఆధార్ కూడా చూపించవచ్చునని అంగీకారం తెల్పింది. ఆధార్ కార్డు దేశంలో నివసిస్తున్నట్టు చెబుతుందే గానీ భారత పౌరులని చెప్పదు. అయితే ఓటు హక్కు పౌరసత్వం లింకు రాజ్యాంగంలో లేదే? ఆ పరీక్ష మరో విధంగా చేయాలి, ఈ రెంటినీ కలిపి మైనార్టీ మతాలపై ద్వేషం, ఓట్ల తొలగింపు చేయాలన్నది సంఘ పరివార్ భావన. ఇ.సి చర్య కచ్చితంగా ఆ దిశలోనే నడిచింది. సెప్టెంబరు 30న ఓటర్ల తుది జాబితా ప్రకటించాక మీరు నిబంధనలు ఉల్లంఘించినట్టు తేలితే మేము రద్దు చేయడానికి వెనకాడబోమని సుప్రీంకోర్టు హెచ్చరించింది. అందుకోసం ఆగకుండానే దేశమంతటా సర్ అమలు చేస్తామని ఇప్పుడు ఇసి ఆదేశాలు జారీ చేసింది. వచ్చే జనవరిలోగా ఎన్నికలు జరిగేవన్నీ ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలే, తమిళనాడు, కేరళ, బెంగాల్ వంటివి. తెలంగాణలోనూ 'సర్' అమలు చేస్తామంటున్నారు. ఎ.పి లో వుండటానికి ఎన్‌డిఎ వున్నా 'సర్' ఆఖరుదాకా ఆగకుండా ఇప్పుడే చేసేయాలని టిడిపి కోరింది. కానీ వారు తెలంగాణలో మొదలు పెడుతున్నట్టు కనిపిస్తుంది. మొత్తం ప్రతిపక్షాలన్నీ ఒక్క తాటిపైకి వచ్చి వుండకపోతే ఇ.సి ఇంత సులభంగా దారికి వచ్చేది కాదు. అయినా సాంకేతిక సాకులతో ఎప్పటికప్పుడు పక్కదోవ పట్టించే ప్రయత్నాలు సాగిస్తూనే వుంటుందని మర్చిపోరాదు.

దేశంలోని ఓటర్లలో సగం మంది ఏ పత్రం చూపించనవసరం లేదని ఇ.సి గొప్పగా ప్రకటించింది. అంటే సగం మంది చూపించాలనే కదా? 2002ను కొలబద్దగా తీసుకోవడమంటే గత ఇరవై ఏళ్లుగా ఓటేస్తున్నవారిని కూడా అనుమానితుల జాబితాలో చేర్చడమే అవుతుంది. సుప్రీం జోక్యం చేసుకోకపోతే మొదట ఇ.సి ఆదేశాల ప్రకారం ఆధార్ చెల్లుబాటయ్యేది కాదు. ఈ నిర్ణయాలన్నీ ఏ దురుద్దేశం లేనివని అనుకోగలమా? ఇప్పటికైనా అన్నీ సక్రమంగా జరిగిపోతాయని విశ్వసించడం ఎలా? సత్సంకల్పమే అయితే తేదీతో సహా 'సర్' ప్రారంభానికి సిద్ధం కమ్మని చెప్పిన ఇ.సి దేశమంతా ఇంత పెద్ద ప్రక్రియ చేసేప్పుడు ముందే అఖిలపక్షం జరిపి సలహాలు, సూచనలు తీసుకుని వుండేది కదా? పైకి ఏమీ అనలేకపోయినా అంతగా మోసే టిడిపి వంటి పార్టీ కూడా కేంద్రం ఆలోచనలనూ ఇ.సి పథకాలను పూర్తిగా బలపర్చడానికి సిద్ధంగా లేదు. పౌరసత్వంతో ముడిపెట్టరాదని స్పష్టంగా చెప్పింది. 'సర్' ముందే పూర్తి చేయాలనీ పారదర్శకంగా జరగాలని అంటున్నది. వైసిపి అధినేత జగన్ మాత్రం రాబోయే స్థానిక ఎన్నికలను కేంద్ర దళాల పర్యవేక్షణలో జరపాలని చెబుతున్నారు.

రోగమొకటి... మందొకటి..

తమాషా ఏమంటే ఓట్ చోరీ, 'సర్' వంటి విషయాలలో విమర్శలను బేఖాతరు చేస్తున్న ఇ.సి ఎవరూ ఇప్పుడు అడగని సంస్కరణలనూ మార్పులు చేర్పులను ముందుకుతెచ్చి హడావుడి చేస్తున్నది. ఇవిఎం లలో వివి ప్యాట్‌లు వంద శాతం వినియోగించాలని, దాని సర్క్యూట్‌లో ఓటు నమోదు తర్వాత వివి ప్యాట్ రావాలని సూచన వస్తే పట్టించుకోవడం లేదు. కానీ అభ్యర్థుల బొమ్మలు రంగుల్లో పెద్ద సైజులో పెట్టడం గొప్ప మార్పుగా చెబుతున్నది. మంచిదే కావచ్చు గానీ అదేమీ కీలకం కాదు. తర్వాత రిజిస్టర్డు పార్టీల జాబితా లోంచి కొన్నిటిని రద్దు చేసింది. గుర్తులనూ అటూ ఇటూ మార్చింది. ఇక ఇప్పుడు పోస్టల్ బ్యాలట్ లెక్కింపులో ముందు వెనకలు చేసి ఇది 30వ సంస్కరణగా ప్రకటించుకుంటున్నది. ఎప్పటి నుంచో పోస్టల్ బ్యాలట్ లెక్కింపు ముందు జరుగుతుంటే దాన్ని మార్చింది ఇసినే. నిరసనల తర్వాతనే ఆచరణలో దాన్ని సవరించుకుంది. బీహార్ ఎన్నికలతో మొదలుపెట్టి ఇవిఎం ల చివరి దఫా లెక్కింపు ముందే పోస్టల్ బ్యాలట్ల లెక్కింపు పూర్తి కావాలని తాజా నిర్ణయం తీసుకుంది. అసలు వదలి కొసరు చూపించినట్టు ఓట్ల చౌర్యం, తొలగింపు, ఇవిఎంల తారుమారు వంటి ఆరోపణలపై సూటిగా చర్చలు చేయకుండా ఇలాంటి వాటితో మురిపించాలనుకుంటే చెల్లుబాటవుతుందా? చాలా సార్లు ఎన్నికల సంఘం సమాధానాలు ప్రకటనలూ కూడా రాజ్యాంగ భాషలో గాక రాజకీయ భాషలో వుండటం, చర్యలు తీసుకుంటామని బెదిరించడం విమర్శకు గురవుతున్నది.

తమాషా ఏమంటే ఓట్ చోరీ, 'సర్' వంటి విషయాలలో విమర్శలను బేఖాతరు చేస్తున్న ఇ.సి ఎవరూ ఇప్పుడు అడగని సంస్కరణలనూ మార్పులు చేర్పులను ముందుకు తెచ్చి హడావుడి చేస్తున్నది. ఇవిఎం లలో వివి ప్యాట్‌లు వంద శాతం వినియోగించాలని, దాని సర్క్యూట్‌లో ఓటు నమోదు తర్వాత వివి ప్యాట్ రావాలని సూచన వస్తే పట్టించుకోవడం లేదు. కానీ అభ్యర్థుల బొమ్మలు రంగుల్లో పెద్ద సైజులో పెట్టడం గొప్ప మార్పుగా చెబుతున్నది. మంచిదే కావచ్చు గానీ అదేమీ కీలకం కాదు. తర్వాత రిజిస్టర్డు పార్టీల జాబితా లోంచి కొన్నిటిని రద్దు చేసింది. గుర్తులనూ అటూ ఇటూ మార్చింది. ఇక ఇప్పుడు పోస్టల్ బ్యాలట్ లెక్కింపులో ముందు వెనకలు చేసి ఇది 30వ సంస్కరణగా ప్రకటించుకుంటున్నది. ఎప్పటి నుంచో పోస్టల్ బ్యాలట్ లెక్కింపు ముందు జరుగుతుంటే దాన్ని మార్చింది ఇసినే. నిరసనల తర్వాతనే ఆచరణలో దాన్ని సవరించుకుంది.

జమిలి జపం మామూలే!

ఇవన్నీ చాలక మోడీ సర్కార్ అసలైన ఆలోచన జమిలిపైనా కసరత్తు కొనసాగిస్తూనే వుంది. కొంతమంది మాజీ న్యాయమూర్తులు కూడా ఇందుకు అనుకూలంగా మాట్లాడుతున్నారు. తాజాగా ఈ అంశంపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) ఆర్థికవేత్తల అభిప్రాయం సేకరించింది. యుపిఎ హయాంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడుగా పని చేసిన మాంటెక్ సింగ్ అహ్లూవాలియా వ్యతిరేకించారు. జమిలి వల్ల ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుందనే వాదనతో ఆయన ఏకీభవించలేదు. ఇప్పటివరకూ జమిలి లేకపోయినా ఆర్థికరంగం బాగానే పనిచేస్తున్నదని ఆయనన్నారు. పైగా ఒకేసారి అన్ని ఎన్నికలు జరపడం వల్ల రాష్ట్ర సమస్యలు మరుగున పడిపోయి ప్రజల అవసరాలు వెనకపట్టు పడతాయని ఆయన అభిప్రాయ పడ్డారు. మరోవైపు బిజెపికి అనుకూలమైన ఆర్థికవేత్త అరవింద్ పనగరియా జమిలిని ఆకాశానికెత్తారు. మాటిమాటికీ ఎన్నికల వల్ల జనాకర్షక పథకాల ప్రకటనలతో ఆర్థిక భారాలు పెరిగిపోతాయని వ్యాఖ్యానించారు. ఈ చర్చలన్నీ కూడా రాజ్యాంగ మూల స్ఫూర్తి అయిన సమాఖ్య విధానాన్ని పట్టించుకోకపోవడం విశేషం. సర్వం పిఎంవో నుంచే జరగాలని చూస్తున్న మోడీరాజ్‌కు ఇది బాగా సరిపోయే ప్రతిపాదన. అన్యథా శరణం నాస్తి అంటూ మోడీనే పట్టుకు ఊరేగుతున్న సంఘపరివార్ బిజెపిలు వచ్చే రెండు ఎన్నికలకు కూడా ఆయనే తమ ప్రధాని అభ్యర్థి అంటుంటే- సీనియర్ నాయకుడు రాజ్‌నాథ్ సింగ్ ఏకంగా 2047లో కూడా మోడీనే తమ ప్రధాని అని సెలవిచ్చారు. ఒకే దేశం, ఒకే కార్డు, ఒకే పన్ను, ఒకే మతం, ఒకే భాష, ఒకే పార్టీ, ఒకే నేత, ఒకే మోడీ అనడం బిజెపికి అవసరం కావచ్చు గాని రాజ్యాంగం, రాజకీయ వ్యవస్థ ఎందుకు ఒప్పుకుంటాయి? ఆ దిశలో పని చేసుకుపోతున్న ఎన్నికల సంఘం పోకడలను ఎందుకు సహిస్తాయి? ★

సమసమాజ నిర్మాణ స్ఫూర్తి ప్రదాత

నివాళి

గుర్రం జాషువా 1895 సెప్టెంబర్ 28న వినుకొండలో జన్మించి, 1971 జులై 24న గుంటూరులో మరణించినా...ఆయన కాలం మాత్రం చిరకాలం సమ సమాజం కోసం పోరాడే యోధుడుగా నిలిచిపోయే కాలంగా చరిత్ర చెబుతుంది.

భారత దేశంలో హిందూ గ్రంథాలలో పేర్కొన్న వర్ణ వ్యవస్థ...పండితులుగా యోధులుగా...కర్షకులుగా సేవకులుగా... విభజించిన సమాజం శాస్త్రంలో లేని అంటరానితనాన్ని...పేదరికాన్ని బట్టి పంచమ కులంగా సృష్టించడం న్యాయమా..?

గుర్రం జాషువాను పంచముడిగా, కడుగొట్టు బిడ్డగా వెలి వేసిన సమాజమిది. బాల్యంలో తోటి పిల్లలతో ఆడుకోవడానికి అడ్డు పడ్డ సమాజంపై చెంప దెబ్బ కొట్టి....అస్పృశ్యతను ఒక జాడ్యంగా పరిగణించడం తప్పు కాదు కదా!

చిన్ననాడే తిరుపతి వేంకట కవుల, కొప్పరపు కవుల అవధానాలకు ముగ్ధుడై వారి కోసం వేదికపై ప్రశంసా పత్రం చదువుతుండగా జాషువాను 'అస్పృశ్యుండీ నిర్భాగ్యుడెట్లు సభలో జొచ్చెనంచు' కొందరు బ్రాహ్మణ పండితులు ఈసడింపు అగ్రకులస్తుల అహంకారానికి నిదర్శనం కాదా!

నాటక ప్రదర్శనలో నాటకం చూడ్డానికి అడ్డు పడ్డ అస్పృశ్యత అనే ఆంక్షలు ఎన్నో ఎన్నెన్నో తనను తరిమి కొట్టినా...చదువుల తల్లి ఒడిలో సేదతీరటం..జాషువా ఊపిరిగా మారదా!

అద్దెకు, ముద్దకు, చాకలి పద్దుకు కూరిమి ముద్దియ మెరిమాంబకు-చాలనందున జీవిక కోసం ఎన్నో కొలువులు చేసిన జాషువా జీవన ప్రయాణంలో కలం ఆయుధంగా చేపట్టారు. అంటరానితనంతో అవమానాలు, ఆత్మక్షోభలు ఎదుర్కొన్న ఆయన హృదయం సంఘ సంస్కరణను వాంఛించటం సమంజసమే కదా!



నేడు గుర్రం జాషువా జయంతి

జాషువా కలంతో విరజిమ్మిన ఖండ కావ్యాలు... ఆయన శ్వాస కోశాలు ఎగజిమ్మిన ఆవిరులు. అయితే "పిరదౌసి"లో కవితకు ప్రభు చేసిన అన్యాయం గోచరిస్తుంది. ఆయన రచనలో మైలు రాయి 'అస్పృశ్యుని ఆత్మక్షోభకు' నివేదిక గబ్బిలం, షాజహాన్ హృదయ ఆవిష్కరణ... వర్ణనల మూట-ముంతాజ్ మహలు- జాషువా కీర్తి సౌధానికి...నాలుగు స్థంబాలుగా నిలిచాయి.

ఆయన రాసిన ఖండకావ్యాల్లో సలసల కాగిన బిందువు అనాథ, సమతా దృక్పథ పీఠిక శ్మశానవాటిక, హృదయాన్ని ఆహ్లాదపరిచే 'శిశువు' వంటివి పాఠకులను విశేషంగా అలరిస్తాయి. క్రీస్తు చరిత్ర కావ్యం జాషువాను కేంద్ర సాహిత్య అవార్డుతో జాతీయ స్థాయిలో నిలబెట్టింది. కవి కోకిల, మధుర శ్రీనాథ, కవితా విశారద, నవ యుగ కవి చక్రవర్తి కళాప్రపూర్ణ, పద్మభూషణ్ వంటి బిరుదులకే వన్నె తెచ్చాడు జాషువా.

"అసమ సమాజం బాకులు కమ్మినప్పుడు అంటరాని తనం విషాగ్నులు చిమ్మినప్పుడు, దుర్భర దారిద్ర్యము వెన్నాడినప్పుడు, దురంతర వేదన గుండెల్లో తుకతుక ఉడికినప్పుడు, జాషువా గుర్తుకు వస్తారు" అన్న డా.సి.నారాయణరెడ్డి ప్రశంస జాషువాను ఆంధ్ర సాహితీ ప్రియుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిందని ఒప్పుకోవలసిందేగదా.

భారత వీరుల పాదాలు కందకుండా చెప్పులు కుట్టిన పంచముడి సేవకు భరత భూమి అప్పు పడ్డదని గుర్తు చేసి..అతని తల మీద రుద్దిన అంటరానితనం అనే బురదను ఆ ఆకాశగంగ కూడా తొలగించడానికి కరుణించదని ఆవేదన చెందటంలో వాస్తవం ఉంది కదా!

శ్మశానంలో పులినీ, మేకను పక్క పక్కనే పడుకోబెడతారని జాషువా చెప్పటంలో అర్థం చనిపోయాక అందరనీ శ్మశానంలో ఒక్కలాగే పాతిపెడతారని. ధనిక, పేద తారతమ్యాలపై జాషువా ఎంతలా విరుచుకు పడ్డారో అర్థమవ్వదా.

కవులు విశ్వమానవులని....వారికి కూడా మానవ లోకం కులం రంగు పులుముతుందని.... అది లక్ష సబ్బులతో రుద్దినా వదలిపోదని....కుల పిచ్చి కవులను బాధిస్తుందని ఆందోళన చెందడంలో కవులు కుల-మతాలకు అతీతులనే జాషువా ఉద్దేశం కనిపిస్తుంది కదా!

జాషువా కవిత్వాన్ని ఆయన జీవితాన్ని విడదీసి చూడలేము. ఆయన జీవిత ప్రయాణాన్ని గుర్తుకు తెచ్చుకున్న ప్రతి హృదయానికి అప్రయత్నంగా కళ్ళు చమర్చక మానవు. సమాజంలో అస్పృశ్యత, ఛీత్కారాలు ఎదురైన స్థానంలో సత్కారాలు అందిపుచ్చుకున్న ధన్యజీవి. మూఢాచారాలపై తిరగబడ్డ అగ్నిగుండం. సమ సమాజాన్ని కాంక్షించిన కష్టజీవుల పక్షపాతి.

జాషువా పద్య రచనలో మార్పు తేవడమే కాదు, వ్యాకరణ నియమాలు సడలించి, భాషా స్వేచ్ఛను ప్రకటించారు. అంతే కాదు 1956లో జాషువా ప్రకటించిన "కొత్త లోకం" ఆయనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరింపజేసింది.

సౌధరాజమందు జన్మించె ఒక బిడ్డ / పూరిగుడిసె లోన బుట్టెనొకడు / ప్రబలి రందు నిందు రాజయ్యె నొక్కడు / నొకడు రాను రాను సుకవియయ్యె అంటూ....అక్షరాల ప్రాధాన్యాన్ని, సమాజ హితైషుల ఆవశ్యకతని చాటిచెప్పారు. నిజాం పాలన తర్వాత సమైక్య ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావం జాషువాని ఆనంద భరితుడ్ని చేసి తాను కలలు కన్న ఎలాంటి కొత్త లోకం చూస్తున్నాడో చెప్పేరు, విశాలాంధ్ర ప్రాతిపదికగా చూపించేరు జషువా.

జాషువా కవిత్వాన్ని ఆయన జీవితాన్ని విడదీసి చూడలేము. ఆయన జీవిత ప్రయాణాన్ని గుర్తుకు తెచ్చుకున్న ప్రతి హృదయానికి అప్రయత్నంగా కళ్ళు చమర్చక మానవు. సమాజంలో అస్పృశ్యత ఛీత్కారాలు ఎదురైన స్థానంలో సత్కారాలు అందిపుచ్చుకున్న ధన్యజీవి. మూఢాచారాలపై తిరగబడ్డ అగ్నిగుండం. సమ సమాజాన్ని కాంక్షించిన కష్టజీవుల పక్షపాతి. దళిత వర్గ జ్వాల స్ఫూర్తి. నవయుగ కవి చక్రవర్తి మన గుర్రం జాషువా చిరస్మరణీయులు.

- డా. జి. మాలతి,
అసిస్టెంట్ ప్రొఫెసర్ (తెలుగు),
సెల్ : 9490824860

ట్రంప్ దెబ్బకు 'వీసా' రా!

అభిప్రాయం



అమెరికా అధ్యక్షుడు ట్రంప్, హెచ్ వన్ బి వీసా ఫీజుని ఎకాఎకీ ఆరు రెట్లు పెంచి వెంటనే అమల్లోకి వస్తున్నట్లు ప్రకటించడం భారత్‌లో ప్రకంపనలు రేపింది. అమెరికాలో ఉన్న కంపెనీలు ఆ దేశ పౌరులు కాని తమ ఉద్యోగుల్ని అక్కడ ఉండి పని చేసుకోడానికి ఉద్దేశించి ఇప్పించే పర్మిట్‌లే హెచ్ వన్ బి వీసాలు. అమెరికా వాటిని మూడు సంవత్సరాల వ్యవధికి ఇస్తుంది. తర్వాత అవసరమైతే ఇంకో మూడేళ్లు పెంచుతుంది. ఆ ఫీజు సంవత్సరానికి లక్ష డాలర్లు అంటే ఎనభై లక్షల రూపాయలుగా అధ్యక్షుడు పెంచినట్లు ప్రకటన మొదట వచ్చింది. తర్వాత అది సంవత్సరానికి కాదు, వన్ టైమ్ కట్టాల్సింది, అదీ కొత్త దరఖాస్తుదారులకే అని వివరణ వచ్చింది. కొంత నయం. భారత్‌లో అలజడి ఎందుకంటే ఆ తరహా వీసాదారుల్లో డెబ్భై శాతం మంది మన దేశం వారే. ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. ఈ నిర్ణయంతో బహుళజాతి కంపెనీలు అమెరికా బయటకు తమ కార్యస్థలాల్ని మార్చుకోవడమో లేదా అక్కడి స్థానికుల్ని నియమించుకోవడమో చేయడం మాత్రమే లాభసాటిగా ఉంటుంది. అమెరికా దేశాన్ని తమ ఉద్యోగ క్షేత్రంగా ఆశించే యువత ఆశలపై ఇది నీళ్ళు జల్లడమే. ప్రపంచీకరణ యుగంలో మేధో వలసల్ని ప్రోత్సహించడం, ఆకర్షించడం ద్వారా పలు దేశాల బుద్ధిజీవుల వల్ల అమెరికా ప్రగతి సాధించింది. ఇప్పుడు ఏదో పేరుతో వారిని దూరం చేసుకుంటోంది. నిపుణుల కోసం ఉద్దేశించిన విధానాలు, నైపుణ్యం అవసరంలేని వారు కూడా వాడుకోవడం వల్ల తమ పౌరుల్లో నిరుద్యోగం పెరిగిందని చెప్తోంది. వారి వల్ల తమ యువతకు, ప్రగతికి నష్టం వాటిల్లుతుందని శాపనార్థాలు పెడుతూ, సామాజిక వైముఖ్యాన్ని పెంచుతోంది. ఇది ప్రమాదకర క్రీడ. ఏదైతేనేం. అది వారి ఇష్టం. మన దేశం మన యువత శక్తిని సంపూర్ణంగా వాడుకొనేటట్లు తయారుకావాలి. ఆ దిశగా నూతన విధానాలు, దేశీయ పరిస్థితులు చక్కదిద్దాలి. రానున్న పాతికేళ్లు యువశక్తి మెండుగా ఉన్న మన దేశానికి ఎంతో కీలకం. విద్యావిధానం, నైపుణ్యాల అభివృద్ధి, ఉపాధి కల్పనలపై దృష్టి పెడితే ప్రపంచ దేశాల అస్థిరపు విధానాల ప్రభావం తగ్గుతుంది.

- డా.డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ, విజయనగరం.

ఆసియా సవాల్

ఆసియా కప్ భారత్, పాకిస్తాన్ సవాల్‌గా మారింది. గ్రూప్, సూపర్4 దశల్లో తలపడిన దాయాదులు.. ముచ్చటగా మూడోసారి టైటిల్ పోరులోనూ ఢీకొడుతున్నాయి. అజేయ రికార్డుతో టీమ్ ఇండియా జోరుమీదుండగా.. పాకిస్తాన్ ప్రతీకార విజయం కోసం ఎదురుచూస్తోంది. ఆసియా కప్ ఫైనల్లో భారత్, పాక్ పోటీపడటం ఇదే తొలిసారి.

- ఫైనల్లో భారత్, పాకిస్తాన్ ఢీ నేడు
- జోరుమీదున్న టీమ్ ఇండియా

రాత్రి 8 నుంచి సోనీస్పోర్ట్స్‌లో..

దుబాయ్ : ఆసియా కప్ ఆఖరు ఘట్టానికి చేరుకుంది. టైటిల్ కోసం ఎనిమిది జట్లు పోటీపడగా.. అంతిమంగా టైటిల్ పోరుకు రెండు జట్లు చేరుకున్నాయి. నిలకడగా విజయాలు సాధిస్తూ భారత్ అలవోకగా ఫైనల్‌కు చేరుకోగా.. నిలకడలేని ఆటతీరుతో పాకిస్తాన్ తుది పోరుకు చేరుకుంది. అజేయ రికార్డుతో టైటిల్ నిలుపుకునేందుకు టీమ్ ఇండియా సిద్ధమవుతోండగా.. ఆసియా కప్ టైటిల్‌తో భారత్ చేతిలో ఓటములకు ప్రతీకారం తీర్చుకోవాలని పాకిస్తాన్ చూస్తోంది. భీకర బ్యాటింగ్, స్పిన్ మాయతో నేడు ఫైనల్లో భారత్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతుండగా.. అనిశ్చితికి మారుపేరైన పాకిస్తాన్ నేడు ఏం చేస్తుందో చూడాలి. భారత్, పాకిస్తాన్ ఆసియా కప్ ఫైనల్ నేడు రాత్రి 8 గంటలకు ఆరంభం. సోనీస్పోర్ట్స్‌లో మ్యాచ్ ప్రసారం కానుంది.

భీకర ఫామ్‌లో భారత్

స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, రవీంద్ర జడేజా వీడ్కోలుతో అభిమానుల్లో ఆసక్తి తగ్గినా.. కుర్రాళ్ల ఆటలో పస మాత్రం తగ్గలేదు. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ భీకర బ్యాటింగ్ చేస్తున్నాడు. ఆరు ఇన్నింగ్స్‌లో 51.50 సగటుతో 309 పరుగులు బాదాడు. సూపర్4లో వరుస అర్ధ సెంచరీలతో అభిషేక్ శర్మ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. స్పిన్ మాయగాడు కుల్దీప్ యాదవ్ ప్రత్యర్థులను తిప్పేస్తున్నాడు. ఆరు మ్యాచుల్లో 9.84 సగటుతో కుల్దీప్ యాదవ్ 13 వికెట్లు పడగొట్టాడు. పరుగుల వేటలో అభిషేక్, వికెట్ల వేటలో కుల్దీప్ అగ్రస్థానాల్లో కొనసాగుతున్నారు. బ్యాటింగ్ విభాగంలో తిలక్ వర్మ, సంజు శాంసన్, సూర్యకుమార్ యాదవ్ సహా శుభ్‌మన్ గిల్లు అభిషేక్‌కు తోడుగా నిలుస్తున్నారు. బౌలింగ్ విభాగంలో అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రాలు కుల్దీప్‌తో కలిసి విజృంభిస్తున్నారు. ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్య, శివం దూబెలు దూకుడుగా ఆడుతున్నారు. బ్యాట్, బంతితో దూకుడు కొనసాగిస్తూనే.. ఫీల్డింగ్‌లో కాస్త మెరుగైతే నేడు టీమ్ ఇండియాకు ఎదురు లేదు.

పోటీ ఇవ్వగలరా?

పాకిస్తాన్ అనిశ్చితికి మారుపేరు. 2017 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు హాట్ ఫేవరేట్‌గా వచ్చిన భారత్‌ను పాక్ అనూహ్య పంచ్ ఇచ్చింది. టైటిల్ లాంఛనమనుకున్న భారత్ నుంచి ట్రోఫీ లాగేసుకుపోయింది. తాజాగా ఆసియా కప్‌లోనూ భారత్ గొప్పగా రాణిస్తోంది. గ్రూప్, సూపర్4 దశల్లో భారత్ జోరు చూశాక.. ఫైనల్లో పాకిస్తాన్ అసలు పోటీదారే కాదు అనిపిస్తోంది.

పిచ్, వాతావరణం

దుబాయ్ పిచ్ స్పిన్‌కు అనుకూలం. పేస్ బౌలర్లకు ఆశించిన అనుకూలత ఉండదు. స్లో వికెట్‌పై భారత్ ముగ్గురు స్పిన్నర్లతో మాయ చేస్తోంది. పాకిస్తాన్ శిబిరం సహజంగా పేస్ బౌలింగ్‌పై ఆధారపడుతుంది. అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత వాతావరణం ఇరు జట్ల ఆటగాళ్లకు సవాల్‌గా మారనున్నాయి. టాస్ నెగ్గిన జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకునేందుకు మొగ్గు చూపనుంది. రెండో ఇన్నింగ్స్‌లో మంచు ప్రభావం ఉండనుంది.

తుది జట్లు (అంచనా) :

భారత్ : అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), తిలక్ వర్మ, సంజు శాంసన్, శివం దూబె, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా.

పాకిస్తాన్ : ఫర్హాన్, ఫకర్ జమాన్, సయీం ఆయుబ్, హుస్సేన్ తలట్, మహ్మద్ నవాజ్, సల్మాన్ ఆఘా, ఫహీం అష్రఫ్, మహ్మద్ హరీశ్, షహీన్ షా అఫ్రిది, హరీశ్ రవూఫ్, అబ్రార్ అహ్మద్.

ఫైనల్లో ఆరోసారి ఢీ

భారత్, పాకిస్తాన్ అన్ని ఫార్మాట్లలో 210 మ్యాచులు ఆడాయి. కానీ టోర్నమెంట్ ఫైనల్స్‌లో ఈ రెండు జట్లు ముఖాముఖి పోరు అరుదు. గత 40 ఏండ్లలో ఐదు అంతకంటే ఎక్కువ జట్లు పోటీపడిన టోర్నమెంట్లలో దాయాది జట్లు ఐదుసార్లు ఫైనల్లో తలపడ్డాయి. ఇందులో పాకిస్తాన్ మూడు సార్లు పైచేయి సాధించగా, భారత్ రెండు సార్లు గెలుపొందింది. 1989 వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ క్రికెట్ ఫైనల్లో, 2007 ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ విజయం సాధించింది. 1986, 1994 ఆస్ట్రల్-ఆసియా కప్ ఫైనల్స్ సహా 2017 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో పాకిస్తాన్ గెలుపొందింది. భారత్, పాకిస్తాన్ ఆసియా కప్ ఫైనల్లో తలపడటం ఇదే ప్రథమం.

పారాలో పతక పంట

పారిస్ ఒలింపిక్స్ పతక విజేత, భారత స్టార్ పారా అథ్లెట్ దీప్తి జీవాంజి న్యూఢిల్లీలో జరుగుతున్న ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో రెండోస్థానం సాధించింది. శనివారం జరిగిన మహిళల 400 టీ20 రేసును దీప్తి జీవాంజి 55.16 సెకండ్లలో ముగించింది. అర్హత రౌండ్‌లో 58.35 సెకండ్లతో మెరిసిన దీప్తి.. కెరీర్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఖేలో ఇండియా, టార్గెట్ ఒలింపిక్ పోడియం (టాప్స్) స్కీమ్‌లో దీప్తి జీవాంజి సహకారం అందుకుంటుంది.

శీతల్, తోమర్‌కు పసిడి దీప్తి జీవాంజి సిల్వర్ షో

ఆర్చరీలో శీతల్ దేవి (18) మహిళల కాంపౌండ్ విభాగంలో వరల్డ్ నం.1 టర్కీ ఆర్చర్‌ను 146-143తో ఓడించింది. మెన్స్ కాంపౌండ్ విభాగం ఫైనల్లో తోమర్ కుమార్ స్వర్ణాన్ని, రాకేశ్ కుమార్ రజతాన్ని సాధించారు. మెన్స్ టీ42-టీ63 హైజంప్‌లో శైలేష్ కుమార్ 1.91 మీటర్ల జంప్‌తో బంగారు పతకం సాధించగా.. 1.85మీతో వరుణ్ సింగ్ కాంస్య పతకం దక్కించుకున్నాడు. 1.78మీతో రాహుల్ నాల్గో స్థానంలో నిలిచాడు.

ఆస్కార్ క్వాలిఫయింగ్ రన్‌లో 'లీడింగ్ లైట్స్'

సూర్య, జ్యోతిక దంపతుల కుమార్తె దియా సూర్య 'లీడింగ్ లైట్స్' అనే డాక్యుమెంటరీతో దర్శకురాలిగా పరిచయమవుతోంది. 13 నిమిషాల నిడివి గల బాలీవుడ్ డాక్యుమెంటరీ ఇది. మహిళా గాఫర్స్.. అంటే సినిమా సెట్లలో లైటింగ్ పని చేసే నిపుణుల ఇతివృత్తంతో ఈ షార్ట్ ఫిల్మ్ తెరకెక్కింది. లేడీ గాఫర్స్ కష్టాలు, సవాళ్లు, డెడికేషన్ ఎలా ఉంటాయన్న అంశాలతో దియా ఈ షార్ట్ ఫిల్మ్ తీశారు. హేతాల్ దెద్దియా, ప్రియాంకా సింగ్, లీనా గంగుర్దే అనే ముగ్గురు మహిళా గాఫర్లు తమ అనుభవాలు, శారీరక, మానసిక సవాళ్లను ఎలా అధిగమించారో ఇందులో చెప్పబోతున్నారు. ఇప్పుడీ చిత్రం ఆస్కార్ క్వాలిఫైంగ్ రన్‌లో ప్రదర్శించబడుతోంది. లాస్ ఏంజెల్స్‌లోని రెగెన్సీ థియేటర్‌లో సెప్టెంబరు 26 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గంటలకు ఈ సినిమా ప్రదర్శన జరగనుంది. ఈ స్క్రీనింగ్ వల్ల 2026 ఆస్కార్‌కు షార్ట్ ఫిల్మ్ విభాగంలో పోటీ పడే అవకాశాన్ని కల్పిస్తుంది.

వరలక్ష్మీ శరత్‌కుమార్ దర్శకత్వంలో ...

వరలక్ష్మీ శరత్‌కుమార్ తన సోదరి పూజా శరత్ కుమార్‌తో కలిసి 'దోసా డైరీస్' పేరుతో కొత్త ప్రొడక్షన్ బ్యానర్‌ను ప్రారంభించారు. ఈ బ్యానర్‌లో వరలక్ష్మీ శరత్‌కుమార్ దర్శకురాలిగా పరిచయం కాబోతున్నారు. ఆమె మెగా ఫోన్ పట్టి 'సరస్వతి' అనే టైటిల్‌తో ఓ సస్పెన్స్ థ్రిల్లర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ విషయాన్ని ఆమె శనివారం ప్రకటించారు. 'దర్శకురాలిగా కొత్త జర్నీ ప్రారంభిస్తున్నానని చెప్పడానికి ఎంతో ఆనందిస్తున్నా. నా అక్క పూజాతో కలిసి ప్రొడక్షన్ హౌస్ మొదలుపెట్టి ఈ సినిమా చేస్తున్నా. కొత్త కథల్ని ప్రేక్షకుల్ని అలరించేందుకు ఈ బ్యానర్‌ను ప్రారంభించాం. దర్శకురాలిగా కూడా నన్ను మరో అడుగు వేసేలా ఆశీర్వదిస్తారని కోరుతున్నాను' అని అన్నారు. ఇందులో వరలక్ష్మీ శరత్‌కుమార్, ప్రియమణి, ప్రకాశ్‌రాజ్, నవీన్ చంద్ర కీలక పాత్రధారులు. తమన్ సంగీతం అందించనున్నారు.

నేడు బిసిసిఐ ఎన్నికలు

ముంబయి : భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) 2025 సాధారణ ఎన్నికలు ఆదివారం జరుగనున్నాయి. ముంబయిలోని ప్రధాన కార్యాలయంలో రానున్న మూడేళ్లకు ఆఫీస్ బేరర్లను ఎన్నుకోనున్నారు. ఒక పదవికి ఒక నామినేషన్ రావటంతో ఏకగ్రీవంగా ఆఫీస్ బేరర్ల ఎన్నిక కానున్నారు. అధ్యక్షుడిగా మిథున్ మన్హాస్, ఉపాధ్యక్షుడిగా రాజీవ్ శుక్లా, కార్యదర్శిగా దేవజిత్ సైకియా, సంయుక్త కార్యదర్శిగా ప్రభతేజ్ సింగ్ భాటియా, కోశాధికారిగా రఘురామ్ భాట్ లాంఛనంగా ఎన్నిక కానున్నారు. అపెక్స్ కౌన్సిల్‌కు జైదేవ్ నిరంజన్ షా, ఐపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌కు అరుణ్ సింగ్ ధుమాల్, ఖైరుల్ జమాల్ మజుందార్‌లను ఎన్నుకోనున్నారు.

దక్షిణ మధ్య రైల్వే
మమ్ములను @ద.మ.రైల్వే ఇండియా పై పాటించండి
ద.మ.రైల్వే యొక్క టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in చూడండి.

నం. బి/సి.పిఎస్/ఎన్ఎఫ్ఆర్/ఇ-యాక్షన్/2025 తేది: 25.09.2025 PUB/1210

ఇ-వేలం ప్రకటన నం. బిజడ్ఎ-12-2025-26.
భారత రాష్ట్రపతి తరపున, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ వారు, పద్దెనిమిది సం॥ల వయసుగల భారతీయ నివాసితులు మరియు కంపెనీలు/ సంస్థల నుండి విజయవాడ డివిజన్ పై ఇతర ఎన్ఎఫ్ఆర్ ప్రకటనలు & పార్కింగ్ కాంట్రాక్టులు అవార్డుచేయుట కొరకు ఐఆర్ఇపిఎస్: www.ireps.gov.in యొక్క 'ఇ-వేలం లీజింగ్' ద్వారా ఇ-వేలంలో ఆహ్వానిస్తున్నారు. ఇ-వేలం షెడ్యూలు దిగువ ఇవ్వబడినది.

కాంట్రాక్టు విధం	వేలంలో ఆఫర్‌చేసిన లాట్స్ సంఖ్య	వేలం షెడ్యూలు తేది& తెరుచు సమయం
ఇతర ఎన్ఎఫ్ఆర్	విజయవాడ డివిజన్ పై నిడమనూరు రైల్వే స్టేషన్ వద్ద బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్.	29/09/2025 @11.00 hrs
	విజయవాడ డివిజన్ పై రామవరపాడు రైల్వే స్టేషన్ వద్ద బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్.	29/09/2025 @11.00 hrs
	విజయవాడ డివిజన్ పై మధురానగర్ రైల్వే స్టేషన్ వద్ద బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్.	29/09/2025 @11.00 hrs
	విజయవాడ డివిజన్ పై గుణదాలా రైల్వే స్టేషన్ వద్ద బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్.	29/09/2025 @11.00 hrs
ఈ నోటీసు ద్వారా ప్రత్యేకించి ఋణగ్రహీత(లు) / తనఖాదారు(లు) / హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయునది ఏమనగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, **గుడివాడ బ్రాంచి (55340)** కు తనఖా/ఛార్జ్ చేయబడిన, దిగువ వివరించబడిన స్థిరాస్తిని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి స్వాధీనం చేసుకున్నారు. దిగువ స్థిరాస్తి ఈ-వేలం అమ్మకం **"ఎక్కడ ఏది ఉన్నదో, అది ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది"** ప్రాతిపదిన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతల నుండి రావలసిన బకాయి మొత్తం **ది. 05.04.2021 డిమాండ్ నోటీస్ నాటికి రూ. 81,05,430.96** పై (అక్షరాలా ఎనభై ఒక్క లక్షల ఐదు వేల నాలుగు వందల ముప్పై రూపాయల తొంభై ఆరు పైసలు మాత్రమే) తదుపరి వడ్డీ, ఖర్చులు/ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు రాబట్టుకొనేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారిచే ఈ-వేలం అమ్మకం ద్వారా డిమాండ్ నోటీసు ప్రకారం **ది.15-10-2025**న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. బిడ్లు సమర్పించుటకు ఆఖరు తేది: ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు.

ఈ వేలం తేది మరియు సమయం : 15-10-2025, మ॥ 12.00 గం. నుండి సా॥ 05.00 గం. వరకు (10 ని॥ల అపరిమిత స్వీయ పొడిగింపులతో)

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా: 1. శ్రీమతి పుప్పాల గీత, భర్త: నండూరి వీర వెంకట ప్రసాద్, డి.నెం. 16-202, సత్యనారాయణపురం, గుడివాడ, కృష్ణాజిల్లా, ఏపి-521301. **2. శ్రీ నండూరి వీర వెంకట ప్రసాద్,** తండ్రి: స్వాములు, డి.నెం.16-202, సత్యనారాయణపురం, గుడివాడ, కృష్ణాజిల్లా, ఏపి-521301.

స్థిరాస్తి వివరములు

ఏపి-534115, ఏలూరు జిల్లా, పెదపాడు మండలం, ఇపూరు గ్రామం, ఆర్.ఎస్.నెం.132/3లో 968 చ.గ.ల ఖాళీ స్థలం శ్రీ నండూరి వీర వెంకట ప్రసాద్ గారికి చెందిన ఆస్తికి హద్దులు: **తూర్పు:** పంట బోదే, **దక్షిణం:** కేతినీడి సునీత గారి భూమి, **పడమర:** కేతినీడి సునీత గారి భూమి, **ఉత్తరం:** పుప్పాల గీత గారి భూమి.

రిజర్వు ధర (రూ.) : రూ. 53,30,000/-, ధరావత్తు ధర (రూ.) : రూ. 5,33,000/- లక్షలు, బిడ్ పెంపుదల మొత్తం : రూ. 1,00,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం **https://baanknet.com** మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్: **https: //www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx** నందు చూడగలరు. అధీకృత అధికారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తి గల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం పైన పేర్కొన్న తేదీ నందు బ్రాంచి హెడ్ మొబైల్ నెం. 8897008810, మెయిల్ ఐడి: ubin0555347@unionbankofindia.bank లలో సంప్రదించవచ్చు.

తేది: 22-09-2025 అధీకృత అధికారి
ప్రదేశము: గుడివాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(భారత ప్రభుత్వ రంగ సంస్థ)

బెంజ్ సర్కిల్ బ్రాంచ్,
సితార టవర్స్, యన్.సి.బి.యన్ కాలనీ
విజయవాడ -520010
ఫోన్ : 9326716091

స్వాధీనత ప్రకటన (రూల్ 8(1)) (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ మరియు ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (చట్టం 54 / 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 9 తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బెంజి సర్కిల్ శాఖ,** అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు **తేది. 14-07-2025** న డిమాండ్ నోటీసు జారీచేసి సదరు నోటీసు అందుకున్న తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన బకాయి **రూ.67,20,757.48** పై (రూపాయలు అరవై ఏడు లక్షల ఇరవై వేల ఏడు వందల యాభై ఏడు మరియు నలభై ఎనిమిది పైసలు మాత్రమే) చెల్లించవలసినదిగా ఋణగ్రహీత **1) శ్రీ బామనపల్లి దేవ్ ఆనంద్ (దరఖాస్తుదారు),** తండ్రి. బి వెంకటప్ప, 20-1333/5, 1వ అంతస్తు, ఫ్లాట్ నెం.103 శ్రీ సాయి రెసిడెన్సీ, గ్రీన్ పార్క్ అవెన్యూ రోడ్, విజయవాడ-07. **2) శ్రీ బామనపల్లి దేవ్ ఆనంద్ (దరఖాస్తుదారు),** తండ్రి. బి వెంకటప్ప, 7-1-621/236/A, ఫ్లాట్ నం.102, భారతి రెసిడెన్సీ, S.R నగర్, S.R నగర్ పోలీస్ స్టేషన్, అమీర్‌పేట్, హైదరాబాద్, తెలంగాణ-500038, **3) శ్రీ బామనపల్లి దేవ్ ఆనంద్ (దరఖాస్తుదారు),** తండ్రి. బి వెంకటప్ప, డోర్.నెం:9-208, బ్లాక్ నెం.9, గాంధీ నగర్, నూజివీడ్ టౌన్, నూజివీడు మున్సిపల్ ఏరియా, నూజివీడు మండలం, ఏలూరు జిల్లా,-521201. **4) శ్రీ దరసనపు అలెగ్జాండర్ (UAPL యొక్క గారంటర్),** తండ్రి. డి. రాంబాబు, 32-22-8, కాంబ్లీబాబా ఆశ్రమం దగ్గర, CSI స్కూల్ రోడ్, మొఘల్‌రాజపురం, విజయవాడ-520010. **5) శ్రీ దరసనపు అలెగ్జాండర్ (UAPL యొక్క గారంటర్),** తండ్రి. డి.రాంబాబు, డోర్.నెం.403, Z.P స్కూల్ ఎదురుగా, అంజి రెడ్డి కాలనీ, తాడేపల్లి, గుంటూరు జిల్లా. 522501.

సదరు మొత్తాన్ని చెల్లించుటలో ఋణగ్రహీతల విఫలమైనందున సదరు రూల్స్‌లోని రూల్ 8 తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన స్థిరాస్తిని దిగువ సంతకందారు **తేది.22-09-2025**న స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఈ స్థిరాస్తితో ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన యెడల అవి **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారికి బకాయి మరియు దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలకు బద్ధులై ఉంటారని ముఖ్యంగా ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తులు విడిపించుకొనుటకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13(8)లోని నిబంధనలు గమనించగలరు.

స్థిరాస్తి వివరములు

ఏలూరు జిల్లా, నూజివీడు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, నూజివీడు మండలం, నూజివీడు మున్సిపల్ ఏరియా, ఆర్.ఎస్ నెం. 135, బ్లాక్ నెం. 9, డి.నెం. 9-208, అసెస్‌మెంట్ నెం. 1071002427, 282.5 చ॥గ॥లు లేదా 236.20 చ॥మీ॥ల విస్తీర్ణంలో నూజ్విడ్ టౌన్, నూజ్విడ్, గాంధీ నగర్‌లో ఉన్న ఆర్.సి.సి. భవనం & సిమెంట్ షీట్ పైకప్పు, రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం. 8069/2023 తేదీ: 26-08-2023, శ్రీ బామనపల్లి దేవ్ ఆనంద్ కు చెందిన ఆస్తి. దీనికి హద్దులు : **తూర్పు:** మున్సిపల్ రోడ్డు, **దక్షిణం:** పేట నాగేశ్వరరావుకు చెందిన ఆస్థి, **పడమర:** రామిశెట్టి రాములుకు చెందిన ఆస్థి, **ఉత్తరం:** చత్రథి కనకదుర్గకు చెందిన ఆస్థి,

తేది : 22-09-2025 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : విజయవాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

జిల్లా జడ్జిల సీనియార్టీ లిస్టు రద్దు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో జిల్లా జడ్జిల అంతర్గత సీనియారిటీపై హైకోర్టు తీర్పు చెప్పింది. 2015 ఏప్రిల్ 5.1.2022న ఇచ్చిన సీనియారిటీ లిస్టును రద్దు చేసింది. తిరిగి సీనియారిటీ జాబితాను 4 వారాల్లోగా తయారు చేయాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. జ్యుడీషియల్ సర్వీస్ రూల్స్ 2007లోని రూల్ 13(2)లోని రోస్టర్ పాయింట్లను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుని లిస్టు తయారు చేయాలంది. 4.2.2017 నాటి సీనియారిటీ లిస్టును దృష్టిలో పెట్టుకోవాలంది. ఇది తయారయ్యే వరకు ఎలాంటి ప్రమోషన్స్ ఇవ్వడానికి వీల్లేదంది. జస్టిస్ రవినాథ్ తిల్హరీ, జస్టిస్ కె మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది. 2022 జనవరి 5న జారీ చేసిన సీనియారిటీ జాబితాను సవాల్ చేస్తూ పలువురు న్యాయాధికారులు వేసిన పిటిషన్లలో ఈ తీర్పు చెప్పింది. 10 శాతం బదిలీ ద్వారా యాక్సిలిరేటెడ్ రిక్రూట్మెంట్ కోటా కింద నియమితులైన తమను 65 శాతం పదోన్నతి కోటా కింద నియమితులైన వారి కంటే జూనియర్లుగా ప్రకటించడాన్ని పిటిషనర్లు సవాల్ చేశారు.

కెనరా బ్యాంక్ Canara Bank

(భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate — A Government of India Undertaking

ప్రాంతీయ కార్యాలయం : భీమవరం
2వ అంతస్తు, జె.పి. రోడ్డు, చిన్నమీరాం, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా-534204.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద REDEMPTION NOTICE

టు:

ఋణగ్రహీత : M/s సద్గురు సాయి ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్, 1417, గ్రౌండ్ ఫ్లోర్, 23 బి క్రాస్, జయనగర్, 3వ బ్లాక్, 12వ మెయిన్, బెంగళూరు. **మేనేజింగ్ డైరెక్టర్ : శ్రీ మణికొండ శ్రీనివాస కుమార్, తండ్రి: వెంకట కృష్ణారావు,** ఫ్లాట్ నెం. 23 & 24, సన్‌రైజ్ లేఅవుట్ యెల్చనహళ్లి, బెంగళూరు-560062. **డైరెక్టర్ : శ్రీమతి మణికొండ వరలక్ష్మి, భర్త: మణికొండ శ్రీనివాసకుమార్,** ఫ్లాట్ నెం. 23 & 24, సన్‌రైజ్ లేఅవుట్ యెల్చనహళ్లి, బెంగళూరు-560062. **డైరెక్టర్ : శ్రీ దాడి వెంకట కృష్ణ వర ప్రసాద్,** 6-3-347/13/102, తేజస్విని అపార్ట్‌మెంట్స్, ద్వారపూడి కాలనీ, పంజాగుట్ట, హైదరాబాద్-500082. **హామీదారు : శ్రీ కూనిశెట్టి కొండలరావు, తండ్రి: వెంకన్న,** బిల్డ్ నెం 131, VSK మెడోస్, ఆంధ్రా షుగర్స్ దగ్గర, తణుకు-534211. **హామీదారు : శ్రీమతి నుసేటి నాగలక్ష్మి అనురాధ, భర్త: శ్రీనివాస రావు,** 23-2-38, భగత్‌సింగ్ రోడ్డు, సత్యనారాయణపురం, విజయవాడ-521201.

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసు (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును).

కెనరా బ్యాంక్, తణుకు బ్రాంచ్, పశ్చిమగోదావరి జిల్లా యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సదరు సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13 (8) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది.

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గౌరవనీయ హైకోర్టు, హైదరాబాద్ న్యాయవ్యవస్థ నిర్ధేశించిన ప్రతిపాదనకు అనుగుణంగా అమ్మకపు నోటీసు ప్రచురణ తేదికి ముందుగా, సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవడానికి తనఖాదారునికి 30 రోజుల ప్రత్యేక నోటీసు జారీచేయబడుచున్నది.

లోను అకౌంట్ **ఋణగ్రహీత/సంస్థ M/s సద్గురు సాయి ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్, మేనేజింగ్ డైరెక్టర్ : శ్రీ మణికొండ శ్రీనివాస కుమార్, డైరెక్టర్లు: శ్రీమతి మణికొండ వరలక్ష్మి మరియు శ్రీ దాడి వెంకట కృష్ణ వర ప్రసాద్ మరియు హామీదారు : శ్రీ కూనిశెట్టి కొండలరావు మరియు శ్రీమతి నుసేటి నాగలక్ష్మి అనురాధ** వారిని బకాయి **రూ. 4,04,41,980.86 (అక్షరాల నాలుగు కోట్ల నాలుగు లక్షలు నలభై ఒక్క వెయ్యి తొమ్మిది వందల ఎనభై రూపాయలు మరియు ఎనభై ఆరు పైసలు మాత్రమే)** మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ **కెనరా బ్యాంక్, తణుకు బ్రాంచ్** అధీకృత అధికారి **తేది 21.05.2025** న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో **ఋణగ్రహీత /సంస్థ, తనఖాదారులు మరియు హామీదారు (పైన తెలిపిన పేర్లు)** విఫలమైనందున **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **తేది. 13.08.2025 మరియు 14.08.2025** న మీ సెక్యూర్డ్ ఆస్తుల ను లాంఛనాత్మక/ భౌతిక స్వాధీనం తీసుకున్నారు మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును కన్నడప్రభ (కన్నడ బెంగుళూరు ఎడిషన్), ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ (ఇంగ్లీష్ బెంగుళూరు ఎడిషన్), హన్స్ ఇండియా (ఇంగ్లీష్ విజయవాడ ఎడిషన్), ప్రజాశక్తి (తెలుగు రాజమండ్రి ఎడిషన్), ప్రజాశక్తి (తెలుగు విజయవాడ ఎడిషన్), ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ (ఇంగ్లీష్ హైదరాబాద్ ఎడిషన్) మరియు మన తెలంగాణ (తెలుగు హైదరాబాద్ ఎడిషన్) వార్తాపత్రికలలో తేది. 17.08.2025న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు బకాయి మొత్తం **రూ. 4,03,84,892.07/-** [illegible]

[illegible]

ఐటమ్ నెం-1 : [illegible]

[illegible]

గమనిక: [illegible]

తేది: 09.09.2025, ప్రదేశం:భీమవరం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

తమిళనాట విషాద దృశ్యాలు

విజయ్ సభ వద్దకు చేరుకున్న అంబులెన్స్‌లు

తొక్కిసలాట అనంతరం గాయపడిన మహిళను ఆసుపత్రిలో చేర్చుతున్న అధికారులు

ప్రాణాలు కోల్పోయిన అభిమానులు

పోలీసు గుప్పెట్లో లేహ్

- 2 గంటలపాటు కర్ఫ్యూ సడలింపు
- పాక్‌తో సంబంధాలున్నాయంటూ వాంగ్‌చుక్‌పై దర్యాప్తు
- జోధ్‌పూర్ జైలుకు తరలింపు

కర్ఫ్యూ సడలించడంతో నిత్యావసర సరుకులను కొనుగోలు చేస్తున్న స్థానికులు

లేహ్ : లేహ్‌లో హింస, పోలీసు కాల్పుల్లో నలుగురు మృతి, జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) కింద పర్యావరణ ఉద్యమకారుడు, రామన్ మెగసేసే అవార్డు గ్రహీత, లేహ్ ఉద్యమ నాయకుడు సోనమ్ వాంగ్‌చుక్ అరెస్టు తదితర పరిణామాల నేపథ్యంలో పోలీసులు, పారామిలటరీ దళాలు పెట్రోలింగ్‌ను, తనిఖీలను ముమ్మరం చేశాయి. ఆయనకు పాకిస్థాన్‌తో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వరుసగా నాలుగో రోజూ కర్ఫ్యూ కొనసాగించారు. అయితే రెండు గంటలపాటు సడలించారు. దీంతో, లేహ్‌లోని వివిధ ప్రాంతాల ప్రజలు నిత్యావసర సరుకుల కోసం బారులు తీరారు. మొదటి విడతగా ఓల్డ్ సిటీ ప్రాంతంలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకూ, మిగిలిన ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.40 నుంచి 5.30 వరకూ కర్ఫ్యూను సడలించినట్లు లడఖ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) ఎస్‌డి సింఘ్ జామ్వాల్ లేహ్‌లో మీడియాకు తెలిపారు. ఈ నెల 24న అల్లర్లలో నలుగురి మృతి, 90 మందికి గాయాల నేపథ్యంలో లేహ్‌లో కర్ఫ్యూ కొనసాగిస్తున్నట్లు చెప్పారు. లెఫ్టినెంట్ గవర్నర్ కవిందర్ గుప్తా రాజ్‌భవన్‌లో ఉన్నతస్థాయి భద్రతా సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహించిన అనంతరం కర్ఫ్యూ సడలింపుపై నిర్ణయం తీసుకున్నారు.

వాంగ్‌చుక్‌పై ఎన్ఎస్ఎ ప్రయోగం

విచారణ లేకుండా 12 నెలలు నిర్బంధించే అవకాశం

జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) కింద లడాఖ్ పోలీసులు అరెస్ట్ చేసిన సోనమ్ వాంగ్‌చుక్‌ను రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జైలుకు తరలించారు. రాష్ట్ర భద్రతకు హాని కలిగించే కార్యకలాపాలకు వాంగ్‌చుక్ పాల్పడుతున్నారని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఆయనను లేహ్‌లో ఉంచడం సబబు కాదని, అందుకే జోధ్‌పూర్ జైలుకు తరలించామని అధికారులు తెలిపారు. రాష్ట్ర హోదా కోసం, ఆరో షెడ్యూలులో చేర్చడం కోసం లేహ్‌లో కొనసాగిన హింస నేపథ్యంలో వాంగ్‌చుక్‌ను శుక్రవారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. 1980వ సంవత్సరపు ఎన్ఎస్ఎ కింద వాంగ్‌చుక్‌ను ఆయన నివాసం సమీపంలో పోలీసులు నిర్బంధించి జోధ్‌పూర్ సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ చట్టం కింద అరెస్ట్ చేసిన వారిని విచారణ జరపకుండా 12 నెలల వరకూ నిర్బంధిం చవచ్చు. తన అరెస్టును ముందుగానే ఊహించిన వాంగ్‌చుక్ అంతకుముందు పాత్రికేయులతో మాట్లాడు తూ 'నేను బయట ఉండే కంటే జైలులో ఉంటేనే దేశ ప్రజలు చైతన్యవంతులవుతారు' అని వ్యాఖ్యానించారు. వాంగ్‌చుక్‌పై ఆరోపణలను లెహ్ అపెక్స్ బాడీ (ల్యాబ్) **సహ ఛైర్‌పర్సన్ చెరింగ్ దార్జే లక్‌రక్ ఖండించారు. వాంగ్‌చుక్‌ను ఎన్ఎస్ఏ కింద అరెస్ట్ చేసి జోధ్‌పూర్** పంపడాన్ని డిజిపి జామ్వాల్ సహా అధికారులు సమర్థించుకున్నారు. నిర్దిష్ట సమాచారం ఆధారంగానే ఈ చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఉన్నత స్థాయి కమిటీ సమావేశం గురించి ప్రభుత్వం సమాచారం ఇచ్చినప్పటికీ, సంప్రదింపులకు సంసిద్ధత తెలిపినప్పటికీ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష కొనసాగించారని వారు ఆరోపించారు.

వాంగ్‌చుక్ అరెస్ట్ నేపథ్యంలో అధికారులు లేహ్‌లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. సమస్యాత్మక ప్రాంతాలలో పోలీసులు, పారా మిలిటరీ దళాల గస్తీ, తనిఖీలు కొనసాగుతున్నాయి. సోనం వాంగ్‌చుక్‌కు పాకిస్తాన్‌తో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నట్లు డిజిపి జామ్వాల్ తెలిపారు. లేహ్‌లో మరణించిన నలుగురి అంత్యక్రియల్లో బంధువులు పాల్గొనేందుకు, సహాయపడేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని చెప్పారు. వాంగ్‌చుక్ ఉద్రేకపూరిత ప్రసంగాల వల్లే హింస జరిగిందని ఆరోపించారు.

వాంగ్‌చుక్ అరెస్ట్‌తో శాంతి నెలకొంటుందనుకోవడం కేంద్రం తప్పు :కాంగ్రెస్

వాంగ్‌చుక్ అరెస్టుతో లడఖ్‌లో శాంతి, సామరస్యాన్ని పునరుద్ధరించవచ్చని ప్రభుత్వం భావిస్తే అది తప్పేనని కాంగ్రెస్ శనివారం పేర్కొంది. ఆయన అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ లడఖ్ యూనిట్ అధ్యక్షుడు నవాంగ్ రిగ్జిన్ జోరా ఒక ప్రకటనలో తెలిపారు.

సోనమ్ వాంగ్‌చుక్‌ను తక్షణమే విడుదల చేయాలి

- అరెస్టును ఖండించిన సిపిఎం

న్యూఢిల్లీ : లడఖ్‌కు రాష్ట్ర హోదా కావాలని, రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తున్న, ఉద్యమానికి అగ్ర భాగాన వుండి నడిపిస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను అరెస్టు చేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. నిరంకుశ జాతీయ భద్రతా చట్టం కింద ఆయనను నిర్బంధించడం వెనుక బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ వైఖరి బహిర్గతమవుతోందని సిపిఎం పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఇది లడఖ్ ప్రజల నిజమైన ఆకాంక్షల పట్ల ధిక్కార ధోరణిని ప్రదర్శించడమేనని వ్యాఖ్యానించింది.

లడఖ్ ప్రజలకు చేసిన హామీలను గౌరవించడానికి బదులుగా అక్కడ జరుగుతున్న ప్రజాస్వామ్య ఉద్యమాన్ని అణచివేయడానికి కర్కశ చర్యలకు పాల్పడే పంథాను ప్రభుత్వం ఎంచుకుందని పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఇది, లడఖ్ ప్రజల ప్రాథమిక హక్కులు, ప్రజాస్వామ్య స్వేచ్ఛలపై తీవ్రంగా దాడి చేయడమే కాగలదని ఆ ప్రకటన పేర్కొంది.

ఇటువంటి చర్యల వల్ల తాము పరాయివారమనే భావన లడఖ్‌తో పాటూ జమ్మూ కాశ్మీర్ ప్రజల్లో పెరుగుతుందని హెచ్చరించింది. తక్షణమే సోనమ్ వాంగ్‌చుక్‌ను విడుదల చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ప్రజలపై పెట్టిన అన్ని కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలని కోరింది. అలాగే ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కులను పూర్తిగా పరిరక్షించాలని కోరింది. ఈ ఉద్యమం న్యాయమైన డిమాండ్లను వెంటనే ఆమోదించాలని, వీటన్నింటికి తోడు ఆరవ షెడ్యూల్‌లో లడఖ్‌ను చేర్చాలని సిపిఎం కోరింది.

మలయాళీ విద్యార్థులపై పాశవిక దాడి

- దోషులపై చర్యకు సిపిఎం ఎంపిల డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మలయాళీ విద్యార్థులను ఢిల్లీ పోలీసులు దారుణంగా కొట్టారు. ఢిల్లీలోని ఎర్రకోట ప్రాంతంలో దొంగతనం ఆరోపణలపై తలపాగాలు ధరించిన విద్యార్థులను స్థానికులు, పోలీసులు కొట్టారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని జాకీర్ హుస్సేన్ కళాశాలలో మొదటి సంవత్సరం పొలిటికల్ సైన్స్ విద్యార్థులు కోజికోడ్‌కు చెందిన ఐటి అశ్వంత్ (18), కాసర్‌గోడ్‌కు చెందిన కె సుధిన్ (18)ను కొట్టారు. విద్యార్థుల తలపాగాలు, వారి భాషను గమనించిన దుండగుల్లో ఒకడు వారి వద్దకు వెళ్లి స్మార్ట్‌వాచ్, ఇయర్‌బడ్‌లు కావాలా అని అడిగాడు. విద్యార్థులు వద్దు అని చెప్పారు. దుండగుడు అశ్వంత్ చేతిలో ఉన్న ఐఫోన్‌ను గమనించి దానిని దొంగిలించాడని ఆరోపించాడు. తరువాత తన సమీపంలోని వ్యక్తులకు ఫోన్ చేసి, వారిచేత కూడా విద్యార్థులను కొట్టించాడు. అశ్వంత్ తన చేతిలో ఉన్న ఫోన్ తనదేనని పదేపదే చెప్పినా వినలేదు. ఆ తరువాత విద్యార్థులు సమీపంలో ఉన్న పోలీసు రవిరంగకు సమాచారం ఇచ్చారు. ఆయన కూడా దాడి చేసిన వారితో కలిసి విద్యార్థులను కొట్టి వారి నుండి ఫోన్ కూడా తీసుకున్నాడు. దాడి చేసిన వారి నుండి ఫోన్ తీసుకున్న అశ్వంత్ సమీపంలోని మరో సహాయక కేంద్రానికి పరిగెత్తాడు. అక్కడ కూడా విద్యార్థులు తప్పించుకోలేకపోయారు. సహాయక కేంద్రానికి సమీపంలో ఉన్న పోలీసు సత్య ప్రకాష్ వారిద్దరినీ బూటు కాలితో తన్ని, లాఠీతో కొట్టాడు. రెండున్నర గంటలపాటు కొట్టడం కొనసాగింది. హిందీలో మాట్లాడాలని, నేరం అంగీకరించి రూ.20 వేలు చెల్లిస్తే విడుదల చేస్తామని చెప్పారు. సుధిన్ ఎస్ఎఫ్ఐ సీనియర్ కార్యకర్తలకు ఫోన్ చేయడంతో వారిద్దరూ దాడి నుంచి తప్పించుకున్నారు. ఎస్ఎఫ్ఐ ఢిల్లీ రాష్ట్ర అధ్యక్షులు సూరజ్ ఇలామోన్, గోపిక, సోహన్ యాదవ్, రవీష్ కుమార్, ఆరిఫ్ సిద్ధిక్ తదితరులు పోలీసు సహాయక కేంద్రానికి చేరుకుని విద్యార్థులను విడిపించారు. ఈ ఘటనపై డిజిపి, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ను సిపిఎం రాజ్యసభ ఎంపి జాన్ బ్రిట్టాస్ కోరారు. మరో సిపిఎం ఎంపి వి శివదాసన్.. కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. ఇద్దరూ పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు.

ఇజ్రాయిల్ రక్షణ యూనిట్‌కు మైక్రోసాఫ్ట్ సేవలు నిలిపివేత

శాన్ ఫ్రాన్సిస్కో : ఇజ్రాయిల్‌కు చెందిన ఓ రక్షణ యూనిట్‌పై మైక్రోసాఫ్ట్ కంపెనీ చర్యలు తీసుకుంది. తన క్లౌడ్ సర్వీసులు పొందకుండా ఆ యూనిట్‌పై ఆంక్షలు విధించింది. గాజాలో పెద్ద ఎత్తున నిఘా కార్యకలాపాలు చేపట్టేందుకు ఇజ్రాయిల్ రక్షణ యూనిట్ మైక్రోసాఫ్ట్‌కు చెందిన క్లౌడ్ సర్వీస్ అజూర్‌ను ఉపయోగించుకుంటోంది. గాజా, వెస్ట్‌బ్యాంక్‌లోని పౌరులపై నిఘా వేసేందుకు వారి ఫోన్‌కాల్స్ డేటాను ఇజ్రాయిల్ రక్షణ దళం భద్రపరుస్తోందని, ఇందుకు అజూర్‌ను వాడుకుంటోందని 'ది గార్డియన్' పత్రిక ఓ వార్తను ప్రచురించింది. దీనిలో వాస్తవాలను నిర్ధారించుకోవడానికి మైక్రోసాఫ్ట్ కంపెనీ రెండు నెలలకు పైగా దర్యాప్తు జరిపింది. గార్డియన్ పత్రిక ప్రచురించిన నివేదిక వాస్తవమేనని తేల్చడానికి తమకు ఆధారాలు లభించాయని మైక్రోసాఫ్ట్ అధ్యక్షుడు బ్రాడ్ స్మిత్ తన ఉద్యోగులకు ఆన్‌లైన్‌లో పోస్ట్ చేసిన సందేశం ద్వారా తెలియజేశారు.

బహుళపక్ష వాణిజ్య వ్యవస్థను బ్రిక్స్ కాపాడుకోవాలి

- విదేశాంగమంత్రి జై శంకర్ పిలుపు

న్యూయార్క్ : రక్షణవాదం, టారిఫ్‌ల అస్థిరత పెరుగుతున్న నేపథ్యంలో బహుళపక్ష వాణిజ్య వ్యవస్థను కాపాడుకోవాల్సి వుందని విదేశాంగ మంత్రి జై శంకర్ బ్రిక్స్‌ను కోరారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా న్యూయార్క్‌లో జరిగిన బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "బహుళపక్షవాదం తీవ్ర ఒత్తిళ్లకు లోనవుతున్న పుడు సహేతుకమైన, నిర్మాణాత్మకమైన మార్పునకు బలమైన స్వరంగా బ్రిక్స్ ధృఢంగా నిలబడింది." అని జై శంకర్ సోషల్ మీడియా పోస్టులో వ్యాఖ్యానించారు. "కల్లోలితమైన ప్రపంచంలో బ్రిక్స్, శాంతి స్థాపన, చర్చలు, దౌత్యం, అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి వుండాలి." అని ఆయన పేర్కొన్నారు. "పెరుగుతున్న రక్షణవాదం, టారిఫ్‌ల అస్థిరత, టారిఫ్‌యేతర అడ్డంకుల ప్రభావం వాణిజ్యాన్ని ప్రభావితం చేస్తున్నపుడు బ్రిక్స్ కచ్చితంగా బహుళపక్ష వాణిజ్య వ్యవస్థను పరిరక్షించాల్సి వుంది." అని ఆయన పేర్కొన్నారు. భారత్‌పై అమెరికా 50శాతం టారిఫ్‌లు విధించిన నేపథ్యంలో జై శంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిని సమగ్రంగా సంస్కరించాల్సి వుందని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం బ్రిక్స్ కృషి చేయాలన్నారు.

వయసు రీత్యా కీలక బాధ్యతల నుంచి తప్పుకున్నా..

- సిపిఐ నేత కె నారాయణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వయసు రీత్యా పార్టీలో కీలక బాధ్యతల నుంచి తప్పుకున్నానని సిపిఐ నేత కె నారాయణ తెలిపారు. శనివారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. చండీగఢ్‌లో జరిగిన తమ పార్టీ జాతీయ మహాసభల్లో కీలక నిర్ణయాలు జరిగాయన్నారు. 75 ఏళ్లు నిండిన వారు నాయకత్వ బాధ్యతల నుంచి రిలీవ్ కావాలని పార్టీ నిర్ణయించిందని తెలిపారు. పార్టీలో అంతర్గత సమస్యలు పరిష్కారం కోసమే ఇకపై పని చేయాల్సి ఉంటుందన్నారు. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజాకు సడలింపు పొడిగిస్తూ జాతీయ మహాసభల్లో నిర్ణయం జరిగిందన్నారు. మళ్లీ సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా రాజా కొనసాగుతారని అన్నారు. పార్టీలో అంతర్గత సమస్యలు ఉత్పన్నమైనప్పుడు వాటిని సక్రమంగా పరిష్కరించే ప్రక్రియ కోసం కంట్రోల్ కమిషన్ ఉందన్నారు. పార్టీ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్‌గా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని చెప్పారు.

ఫుడ్ ఇండస్ట్రీలో పెట్టుబడులకు ఆహ్వానం

- మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో ఫుడ్ ఇండస్ట్రీలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే వారికి రెడ్ కార్పెట్ వేస్తున్నామని పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టిజి భరత్ తెలిపారు. ఫుడ్ పరిశ్రమలో రాష్ట్రానికి 15 నెలల్లో రూ.10 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. శనివారం నాడిక్కడ వరల్డ్ ఫుడ్ ఇండియా-2025 ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ఎపి పెవిలియన్‌ను మంత్రి టిజి భరత్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైస్ బోల్ ఆఫ్ ఇండియాగా రాష్ట్రాన్ని పిలుస్తారని అన్నారు. ఫుడ్ పరిశ్రమలో 20 వేల ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు.

జన్మహక్కు పౌరసత్వానికి ముగింపు పలకండి

- అమెరికా సుప్రీంకోర్టును కోరిన ట్రంప్

వాషింగ్టన్ : జన్మహక్కు పౌరసత్వాన్ని రద్దు చేయడానికి తాను చేసిన ప్రయత్నం చట్టబద్ధమా కాదా అనే విషయాన్ని సమీక్షించాల్సిందిగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆ దేశ సుప్రీంకోర్టును కోరారు. జన్మహక్కు పౌరసత్వానికి ముగింపు పలకాలని అభ్యర్థించారు. తద్వారా ఓ పెద్ద రాజ్యాంగపరమైన పోరుకు ఆయన నాంది పలికారు. జన్మహక్కు పౌరసత్వాన్ని రద్దు చేసే ప్రయత్నంలో భాగంగా ట్రంప్ గతంలో ఎగ్జిక్యూటివ్ ఆదేశం జారీ చేశారు. అయితే దీనిని అమెరికాలోని రెండు దిగువ కోర్టులో కొట్టివేశాయి. దీనిని సవాలు చేస్తూ న్యాయ శాఖ సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. జనవరిలో అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజే ట్రంప్ ఈ ఆదేశంపై సంతకం చేశారు. తల్లిదండ్రులలో కనీసం ఒకరు అమెరికా పౌరుడు లేదా పౌరురాలు కాకపోయినా లేదా చట్టబద్ధంగా శాశ్వతంగా దేశంలో నివసించకపోయినా వారికి అమెరికాలో పుట్టిన పిల్లలకు పౌరసత్వాన్ని నిరాకరించాలని ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా ప్రభుత్వ సంస్థలను ట్రంప్ ఆదేశించారు. దిగువ కోర్టులు ఇచ్చిన రూలింగ్ సరిహద్దు భద్రతను పట్టించుకోలేదని, అర్హత లేని వేలాది మందికి పౌరసత్వాన్ని పొడిగించిందని న్యాయ శాఖకు చెందిన న్యాయవాదులు తెలిపారు. కాగా ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఆదేశాన్ని వ్యతిరేకిస్తూ న్యాయస్థానాలలో పలు కేసులు దాఖలయ్యాయి.

ట్రంప్ ఆదేశం అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణను ఉల్లంఘిస్తోందని పిటిషనర్లు వాదించారు. అమెరికా భూమిపై పుట్టిన ఎవరికైనా పౌరసత్వం కల్పించాలని ఆ సవరణ నిర్దేశిస్తోంది. పిటిషనర్ల వాదనతో అనేక రాష్ట్రాలలో ఫెడరల్ న్యాయమూర్తులు ఏకీభవించారు. ట్రంప్ ఆదేశాలు అమలు కాకుండా రూలింగ్ ఇచ్చారు. ట్రంప్ ఆదేశాన్ని సవాలు చేస్తూ వాషింగ్టన్ రాష్ట్రం, మరో ముగ్గురు, అలాగే న్యూ హాంప్‌షైర్‌లోని కొందరు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్లు ప్రస్తుతం హైకోర్టు ముందు ఉన్నాయి.

నన్ను తొలగించకుండా ట్రంప్‌ను అడ్డుకోండి

- సుప్రీంకోర్టును కోరిన అమెరికా రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్ లీసా కుక్

వాషింగ్టన్ : తనను పదవి నుంచి తొలగించేందుకు దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని అమెరికా రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్ లీసా కుక్ సుప్రీంకోర్టును అభ్యర్థించారు. అధ్యక్షుడి అసాధారణ చర్య కేంద్ర బ్యాంక్ స్వతంత్రతను దెబ్బతీస్తుందని, ఆర్థిక మార్కెట్లకు హాని కలిగిస్తుందని ఆమె వాదించారు. కుక్‌ను పదవి నుంచి తొలగించకుండా ట్రంప్‌ను నిరోధిస్తూ ఫెడరల్ జడ్జి గతంలో ఆదేశాలు జారీ చేశారు. దీనిని సవాలు చేస్తూ న్యాయ శాఖ ఈ నెల 18న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఫెడరల్ జడ్జి ఆదేశాలను తక్షణమే కొట్టివేయాలని అభ్యర్థించింది. దీనిని వ్యతిరేకిస్తూ కుక్ న్యాయవాది సుప్రీంకోర్టులో లిఖితపూర్వక అభ్యర్థన సమర్పించారు. రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్‌గా కుక్‌ను మాజీ అధ్యక్షుడు జో బైడెన్ నియమించిన విషయం తెలిసిందే. కుక్ న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ అది యథాతథ స్థితిని మారుస్తుందని,రిజర్వ్‌బ్యాంక్‌ను అధ్యక్షుడి ఇష్టానికి లోబడి ఉండే సంస్థగా చేస్తుందని తెలిపారు.

అణు అంక్షల నేపథ్యంలో

- ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ రాయబారులను వెనక్కి పిలిపించిన ఇరాన్

టెహరాన్ : ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్‌ల నుండి తమ రాయబారులను ఇరాన్ శనివారం వెనక్కి పిలిపించింది. సంప్రదింపుల కోసం రాయబారులను వెనక్కి పిలిపిస్తున్నట్లు స్థానిక మీడియా తెలిపింది. ఇరాన్ అణు కార్యక్రమాన్ని తిరిగి అమలు చేస్తున్న నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి ఆంక్షలు విధించేందుకు సిద్ధమైన తరుణంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. శనివారం అర్ధరాత్రి 12గంటల నుండి ఈ అంక్షలు అమల్లోకి రానున్నాయి. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థతో ఇరాన్ సహకరించకపోవ డం, అమెరికాతో ప్రత్యక్షంగా చర్చలు జరపకపోవడంపై ఈ మూడు దేశాలు ఇరాన్‌పై మూకుమ్మడిగా తిరిగి ఆంక్షలు విధించేందుకు సిద్ధమయ్యాయి. ఈ ఆంక్షల వల్ల విదేశాల్లోని ఇరాన్ ఆస్తులు మళ్లీ స్తంభింపజేస్తారు. ఆయుధ ఒప్పందాలు నిలిచిపోతాయి. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాన్ని అభివృద్ధిపరిస్తే చర్యలు వుంటాయి. ఇలా పలు ఆంక్షలు అమల్లోకి రానున్నాయి.

ఆమోదయోగ్యం కాదు : ఇరాన్ అధ్యక్షుడు

శుద్ధి చేసిన యురేనియం మొత్తాన్ని తమకు అప్పగించాలని అమెరికా డిమాండ్ చేస్తోందని, ఇది తమకు ఎంత మాత్రమూ ఆమోద యోగ్యం కాదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెషికాన్ స్పష్టం చేశారు. ఆంక్షల నుండి మూడు మాసాలు ఉపశమనం కలిగిస్తామని, అందుకు తమకు అణు సామాగ్రిని మొత్తంగా అందజేయాలని కోరుతోం దని అన్నారు. న్యూయార్క్ నుండి స్వదేశానికి బయలుదేరడానికి ముందుగా అధ్యక్షుడు పెజెషికా న్ విలేకర్లతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

గాజాలో వైమానిక, భూతల దాడులు

- 66మంది మృతి
- కేప్‌టౌన్‌లో వేలాదిమందితో ప్రదర్శన

కేప్‌టౌన్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న నిరసనకారులు

దేర్ అల్ బాలాహ్ : గాజా వ్యాప్తంగా ఇజ్రాయిల్ శనివారం ఉదయం నుండి కొనసాగిస్తున్న వైమానిక దాడులు, కాల్పుల్లో 66మంది మరణించారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. వీరిలో గాజా నగరంలో 36మంది చనిపోగా, సెంట్రల్, దక్షిణ గాజాల్లో ఆహారం కోసం వెళ్ళిన వారు ఆరుగురు మరణించారు. నుస్రత్ శరణార్థ శిబిరంలోని ఒక ఇంట్లో ఒకే కుటుంబంపై జరిగిన దాడిలో 11మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో సగం మంది మహిళలు, చిన్నారులే. తెల్లవారు జామునే జరిగిన వైమానిక దాడుల్లో ఇళ్లలో వున్నవారు వున్నట్లే చనిపోయారు. షాటి శరణార్థ శిబిరంలో ఒక ఇంటిపై జరిగిన దాడిలో నలుగురు అక్కడికక్కడే మరణించారు. వందలు వేల సంఖ్యలో పాలస్తీనియన్లు దాడుల్లో చిక్కుకుని, ఎటూ కదల్లేక ఆకలితో అల్లాడుతూ వున్నా, అన్ని వైపుల నుండి నిర్దాక్షిణ్యంగా, కర్కశంగా భూతల దాడులను మిలటరీ కొనసాగిస్తోంది. సదరన్ కమాండ్‌లో డివిజన్ 98 బలగాలు ఉధృతంగా దాడులు చేస్తున్నాయి.

కేప్‌టౌన్‌లో భారీ ప్రదర్శన

ఇదిలావుండగా, గాజాలో తక్షణమే కాల్పుల విరమణ అమలు జరగాలని డిమాండ్ చేస్తూ దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌లో వేలాదిమంది ప్రదర్శన నిర్వహించారు. ఇటీవల కాలంలో కేప్‌టౌన్‌లో అనేక నిరసనలు చోటుచేసుకున్నాయ. ఇజ్రాయిలీ ఎంబసీని మూసివేయాలని, ఆ దేశంతో దౌత్య సంబంధాలు తెంచుకోవాలని కోరుతూ దక్షిణాఫ్రికా పార్లమెంట్ తీర్మానం కూడా చేసింది.

ప్రస్తుతం పార్లమెంట్‌కు ప్రదర్శన కూడా నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని వైపుల నుండి డిమాండ్లు వెల్లువెత్తుతున్నా అమెరికా వత్తాసు, ఆయుధ బలంతో ఇజ్రాయిల్ పట్టించుకోవడం లేదు. మహిళలు, చిన్నారులను ప్రతిరోజూ బలిగొంటూ... హమాస్ పని ముగించే వరకు దాడులను ఆపేది లేదని నెతన్యాహు శుక్రవారం జనరల్ అసెంబ్లీలో నిస్సిగ్గుగా ప్రకటించిన సంగతి తెలిసిందే.

హైడ్రో పవర్ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ చేపట్టిన భారీ ర్యాలీలో వి.శ్రీనివాసరావు, గిరిజనులు

జలసమాధి చేస్తామంటే ఊరుకోం

(మొదటిపేజి తరువాయి)

జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ హైడ్రోపవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలని ఆదివాసీలు ఉద్యమిస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. రానున్న కాలంలో పోరాటం ఉధృతం కానుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ధర్మాన పడాల్, పి.బాలదేవ్, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వేలాది మంది ఆదివాసీలు పాల్గొన్నారు. అరణ్య గర్జన సభకు ముందు ఈ నెల 22 నుంచి 27 వరకూ సిపిఎం ఆధ్వర్యాన సీలేరు నుండి మజ్జివలస వరకు హైడ్రోపవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా 400 కిలోమీటర్లు జీపుజాతా జరిగిన విషయం తెలిసిందే.

ఉభయ సభలు నిరవధిక వాయిదా

(మొదటిపేజి తరువాయి)

పెట్టారు. మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలకు చెందిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. కార్మికులకు పనిగంటలు పెంపుపై ప్రవేశపెట్టిన బిల్లును వ్యతిరేకించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పిఆర్‌సి, డిఎ బకాయిలపై పలు మార్లు సభలో ప్రస్తావించారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకించారు. బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ అన్ని పనులకు మంత్రి లోకేష్ చెబితేనే అవుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. సభలో నందమూరి బాలకృష్ణ శాసన సభలో చిరంజీవిపై చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపాయి. టిడిపి, జనసేన మధ్య అంతర్గతంగా నెలకొన్న విభేధాలు బాలకృష్ణ వ్యాఖ్యలతో బహిర్గతం అయ్యాయి. దీనిపై ఎవ్వరూ మాట్లాడవద్దని కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సిలకు ఆ పార్టీ అధినేతలు అంతర్గత హెచ్చరికలు చేశారు.

కొలంబియా అధ్యక్షుడి వీసా రద్దు

- అమెరికా కక్షసాధింపు
- ఐరాసలో ట్రంప్‌ను విమర్శించిన పెట్రో

వాషింగ్టన్ : కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో వీసాను అమెరికా రద్దు చేసింది. పెట్రో నిర్లక్ష్య వైఖరి, రెచ్చగొట్టే చర్యల కారణంగా వీసాను రద్దు చేస్తున్నామని శనివారం ఆ దేశ విదేశాంగ శాఖ సోషల్ మీడియా ఎక్స్‌లో ప్రకటించింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లి సమావేశాల నిమిత్తం న్యూయార్క్ వచ్చిన పెట్రో ఐరాస కార్యాలయం వద్ద జరుగుతున్న పాలస్తీనా అనుకూల నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం ఐరాస సమావేశంలో మాట్లాడుతూ అనేక దేశాలు పాలస్తీనాను గుర్తించినా ట్రంప్ గుర్తించలేదని, గాజా మారణహోమంలో అమెరికా భాగస్వామి అని విమర్శించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పేరుతో కరేబియన్ సముద్ర జలాల్లో అమాయకులైన, సంబంధంలేని వారిపై క్షిపణి దాడులు చేస్తుందని విమర్శించారు. ఈ దాడులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సూచించారు. పెట్రో ఈ వ్యాఖ్యలు చేసిన తరువాత అమెరికా ఆయన వీసాను రద్దు చేయడం గమనార్హం. అమెరికాకు కొలంబియా ప్రదాన వాణిజ్య భాగస్వామి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు వ్యతిరేక చర్యలకు మద్దతిచ్చిన మిత్ర దేశం అయితే ట్రంప్ అధికారంలోకి వచ్చిన తరువాత స్వరం మారింది. కొలంబియాకు తొలి వామపక్ష అధ్యక్షుడైన పెట్రో అమెరికా వలస విధానాన్ని వ్యతిరేకించారు. తమ దేశ పౌరులను బలవంతంగా సైనిక విమానాల్లో నేరస్తుల్లా తరలించడాన్ని ఖండించారు. సుంకాల బెదిరింపులకు లొంగిపోకుండా తిరిగి అధిక సుంకాలను విధించారు. వీసాల రద్దు విషయంలో అమెరికా తీరును పలువురు విమర్శిస్తున్నారు.. పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్ వీసాను అమెరికా రద్దుచేయడంతో ఐరాస సమావేశంలో ఆయన ఆన్‌లైన్‌లో ప్రసంగించాల్సి వచ్చింది. బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బొల్సనారో అవినీతిపై తీర్పు వెల్లడించిన కోర్టు జడ్జి వీసాను కూడా రద్దు చేసింది. అమెరికా తన రాజకీయ ప్రయోజనాల కోసం వీసా రద్దును ఉపయోగించుకుంటుందని పలువురు విమర్శిస్తున్నారు.

జీవన సౌరభం

ఆలోచించి తీసుకున్న నిర్ణయం, కష్టపడి తెచ్చుకున్న అవకాశం, ఓటమి తర్వాత వచ్చే అనుభవం, గొప్ప వ్యక్తిత్వం వల్ల వచ్చే అభిమానం ఎప్పటికీ వృథా పోవు.

మీ కోసం

వెన్నలోంచి చెడు వాసన వస్తుంటే కరివేపాకు, కొత్తిమీర కరగబెట్టేముందే కలపాలి. ఆ తరువాత ఫిల్టర్ చేస్తే నెయ్యి రుచిగా ఉంటుంది.

ఎదురొచ్చిన నల్ల పిల్లి



కొరిపెల్ల గ్రామానికి చెందిన జోగినాథానికి వాస్తు, జాతకాలంటే విపరీతమైన నమ్మకం. ఏ పని మొదలుపెట్టాలన్నా ఎదురు చూసుకునే బయలుదేరేవాడు. ఒకరోజు ఒక ముఖ్యమైన పని మీద జోగినాథం పట్టణానికి బయలుదేరాడు. ఇంటి నుంచి బయటకు రాగానే ఒక నల్ల పిల్లి ఎదురొచ్చింది. వెంటనే వెనక్కి తిరిగి ఇంట్లోకి వెళ్లి ఒక గ్లాసు నీళ్లు తాగాడు.

వెనక్కి వచ్చిన తండ్రిని చూసి కొడుకు సత్యం, 'నాన్న గారు, ఎందుకు మళ్ళీ వెనక్కి వచ్చారు?' అని అడిగాడు. 'ఒక ముఖ్యమైన పని మీద వెళ్తుంటే పిల్లి ఎదురొచ్చిందిరా! అందుకే వెనక్కి వచ్చాను' అన్నాడు జోగినాథం.

'పిల్లి వస్తే ఏమైంది నాన్న? అది ఉదయం పూట దాని ఆహారం కోసం వెళ్తూ ఉంటుందేమో. అది మిమ్మల్ని ఏమీ చేయలేదు కదా?' అని అడిగాడు సత్యం. కొడుకు చెప్పిన మాటలు జోగినాథానికి నచ్చలేదు. కాసేపు ఇంట్లోనే కూర్చుని మళ్లీ బయలుదేరాడు. అప్పటికే ఆ పనికి సమయం మించిపోతోంది. పిల్లికి ఏమీ దొరకలేదేమో అక్కడే తిరుగుతోంది. దాన్ని చూసి భయపడుతూ, జాగ్రత్తగా నడుచుకుంటూ వెళ్లాడు జోగినాథం. ఆ భయంతో ప్రతి పని ఒకటికి పదిసార్లు చూసుకుంటూ చేశాడు. మధ్యాహ్నానికే పని పూర్తి కావడమే కాదు, ఎక్కడా పొరపాటు లేకుండా చూసుకున్నాడు. పని పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన తండ్రిని చూసి 'వెళ్లిన పని ఎలా అయ్యింది నాన్న గారు?" అని సత్యం అడిగాడు.

'చాలా బాగా అయ్యిందిరా! ఎక్కడా సమయం వృథా కాలేదు' అన్నాడు జోగినాథం. 'అదంతా ఆ నల్ల పిల్లి వల్లే!' అన్నాడు సత్యం. 'అదెలా?' ఆశ్చర్యంగా అడిగాడు జోగినాథం. 'నల్ల పిల్లి ఎదురొచ్చింది కాబట్టి మీకు భయం వేసింది. ఆ భయంతో ప్రతి పని జాగ్రత్తగా చేయాలనే ఆలోచన వచ్చింది. దాంతో పని తొందరగా, జాగ్రత్తగా పూర్తి చేసుకున్నారు' అని వివరించాడు సత్యం.

'అవునురా! నువ్వు చెప్పింది నిజం' అని ఒప్పుకున్నాడు జోగినాథం. 'ప్రతి జీవి తన ఆహారం కోసం ఉదయం పూట బయట తిరుగుతూ ఉంటుంది. అంతేగానీ మనకి ఎదురు రావాలని కాదు. పిల్లి ఎదురొచ్చిందని, బల్లి మీద పడిందని మూఢ నమ్మకాలు పెట్టుకుంటారు. అవి ఎదురొచ్చినంత మాత్రాన మన పని చెడిపోదని తెలుసుకోవాలి. ఆరోగ్యం బాగా లేకపోతే డాక్టరు దగ్గరికి వెళ్లడానికి అమావాస్య అని మానేస్తామా? నమ్మకాలు ఉండాలి కానీ మూఢ నమ్మకాలు ఉండకూడదు నాన్న ' అన్నాడు సత్యం. 'చిన్నవాడివైనా 'సత్యం' చెప్పావురా సత్యం! ఇకపై నేను మూఢ నమ్మకాలు పెట్టుకోను' అని నవ్వుతూ అన్నాడు జోగినాథం.

– కూచిమంచి నాగేంద్ర,
91821 27880.

నేను గీసిన బొమ్మ

- ఎస్. దుర్గా దృశ్య శ్రీ,
5వ తరగతి,
ఎంపిపిఎస్, అయ్యంకి.
మొవ్వ మండలం,
కృష్ణా జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అశ్రద్ధ వద్దు... అప్రమత్తతే అస్త్రం

రేపు ప్రపంచ హృదయ దినోత్సవం

ప్రతి ఒక్కరూ గుండె ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. క్రమం తప్పకుండా తనిఖీలు, ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించటం, గుండె దడ వంటి లక్షణాల గురించి తెలుసుకోవడం వల్ల ప్రధాన గుండె సంబంధిత సంఘటనలను నివారించొచ్చు. ఎవరైనా అసాధారణ గుండె లక్షణాలను ఎదుర్కొంటుంటే వైద్య నిపుణులను సంప్రదించటం ఉత్తమం.



మానవుడి శరీరంలో అతి ముఖ్యమైన అవయవమైన హృదయం (గుండె) శరీరానికంతటికీ రక్తాన్ని సరఫరా చేయటంతోపాటుగా అనేక రకాల విధులను నిర్వర్తిస్తుంది. గుండె ఒత్తిడికి గురి కాకుండా చూసుకోవాలి. సరైన ఆహారపు అలవాట్లు, మెరుగైన జీవనశైలి, ప్రశాంతమైన వాతావరణంలో ఉండగలిగితే గుండె సంబంధిత వ్యాధులు దరి చేరబోవు. ప్రతి ఒక్కరిలోనూ తమ గుండె బలహీనపడిందని తెలియగానే భయం, బాధ, ఆందోళన వంటివి కలుగుతాయి. ముందు భయపడకుండా తమకు వచ్చిన వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి. గుండె దడ సాధారణంగా స్వల్పకాలికంగా ఉన్నప్పటికీ, వాటిని తరచుగా అనుభవించడం ఆందోళన కల్గిస్తుంది. గుండె దడ సాధారణంగా ప్రమాదకరం కాదు. కానీ, విస్మరించకూడదు, ముఖ్యంగా ఇబ్బందికరమైన లక్షణాలు ఉన్నప్పుడు. వాటి కారణాలను అర్థం చేసుకోవడం, అవి ఎప్పుడు ప్రమాదకరంగా మారుతాయో గుర్తించడం, ఎప్పుడు సహాయం తీసుకోవాలో తెలుసుకోవడం మంచి గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కీలకం. ఇసిజి, రక్తపరీక్షలు, హార్ట్‌స్కానింగ్, సిటి యాంజియో వంటి పరీక్షలు చేయించుకుంటే వ్యాధి గురించి తెలుసుకోవచ్చు. తరచూ బిపి, షుగర్, కొలెస్ట్రాల్ వంటివి కూడా చేయించుకోవాలి.

గుండెపోటు.. జర భద్రం

సాధారణంగా 18 ఏళ్లు పైబడిన పురుషులు, మహిళలు గుండె జబ్బులకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంది. ఇలాంటి సమస్యలే కుటుంబంలో ఉంటే మిగతా వారికి కూడా వచ్చే అవకాశం ఉంటుంది. చాలా సందర్భాల్లో గుండెపోటు ఉదయం 4 నుంచి 7 గంటల మధ్య వస్తుంది. వేసవి కంటే శీతాకాలంలోనే ఈ కేసులు ఎక్కువగా ఉంటాయి. చలితో గుండె ధమనులు కుంచించుకుపోవటం కూడా ఒక కారణం. బీపీ పెరిగినా గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. ఈ ప్రమాదాన్ని గమనించటం ద్వారా కొన్ని వైద్యపరమైన పద్ధతులను అనుసరించటం ద్వారా నివారించొచ్చు.

ఇవి పాటించడం మేలు

గుండె సమస్యలున్నవారు ఈ మరింత జాగ్రత్తగా ఉండాలి. తాజా పండ్లు, కూరగాయలు, విత్తనాలు, కాయలు, చిక్కుళ్లు, పప్పుధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలి. మద్యపానానికి దూరంగా ఉండాలి. అది చర్మంలోని రక్త నాళాలకు విస్తరించి, శరీరంలోని ముఖ్యమైన అవయవాల నుంచి వేడిని తీసుకుంటుంది. ధూమపానం గుండె వైపు ఆక్సిజన్ ప్రవాహాన్ని తగ్గిస్తుంది. హదయ స్పందన రేటు, రక్తపోటును పెంచుతుంది. ఉష్ణోగ్రత అకస్మాత్తుగా పడిపోవడం వల్ల రక్త నాళాలు సంకోచిస్తాయి. గుండెపై అదనపు ఒత్తిడి పెరిగి ఆక్సిజన్ సరఫరా తగ్గుతుంది. కాబట్టి తగిన ఉష్ణోగ్రత ఉన్న గదుల్లో ఎక్కువ గడపాలి. శరీర ఉష్ణోగ్రత 95 డిగ్రీల కంటే తక్కువగా ఉంటే, గుండె కండరాలకు హాని కలిగించే అల్పోష్ణస్థితికి గురవుతారు. చల్లని వాతావరణంలో ఎక్కువ సమయాన్ని గడిపేవారు, రక్తపోటు, డయాబెటిస్, అధిక కొలెస్ట్రాల్ సమస్యలున్నవారు, ధూమపానం, పొగాకు తీసుకునే వారికి ఈ స్థితి ఇబ్బందికరం.

జాగ్రత్తలు పాటిస్తే 85 శాతం మరణాలను ఆపొచ్చు

నేటి డిజిటల్ ప్రపంచంలో మనిషి జీవన శైలి మారిపోయింది. శారీరక శ్రమ లేకపోవటం, వృత్తి, ఉద్యోగాల్లో ఒత్తిడులు వంటి సమస్యలతో సతమతమవుతున్నారు. ఫలితంగా చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకూ హృదయ సంబంధిత వ్యాధుల బారిన పడుతుండటం ఆందోళన కల్గించే విషయం. ఈ వ్యాధితో ప్రపంచవ్యాప్తంగా ఏటా రెండు కోట్ల మంది మృత్యువాత పడుతున్నారు. మన దేశంలో 30 శాతం ఆకస్మిక మరణాలు గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించినవే. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముందస్తుగానే గుండె జబ్బులను గుర్తించే పరిజ్ఞానం అందుబాటులో ఉంది. గుండెపోటుకు ప్రధాన కారణం గుండెకు దారితీసే రక్తనాళాల్లో అడ్డుపడటం. ఇలాంటివి ముందుగానే గుర్తించేందుకు ఏడాదికి ఒకసారైనా పూర్తి శరీరాన్ని టిఎంటి అనే ట్రెడ్ మిల్ టెస్ట్ చేయించుకోవటం మంచిది. గుండె జబ్బులు, స్ట్రోక్, కార్డియోవ్యాస్కులర్ వంటి ప్రమాద కారకాలను ఈ టెస్ట్ ద్వారా తెలుసుకోవచ్చు.

గుండె జబ్బుల్లో అనేక రకాలున్నా సకాలంలో గుర్తించగలిగితే సరైన చికిత్సల ద్వారా త్వరగా తగ్గించే అవకాశం ఉంటుంది. మాసివ్ హార్ట్ ఎటాక్ వస్తే గుండె పరిమాణాన్ని తగ్గిస్తే ఆ రోగికి మళ్లీ బాగా స్వస్థత చేకూరే అవకాశం ఉంది. గుండె మార్పిడి శస్త్ర చికిత్సల్లోనూ అత్యాధునిక పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. తోరాకో స్కోపిక్, స్టెమీ పద్ధతి ద్వారా రోబోట్స్‌ని ఉపయోగించి గుండె చికిత్సలు విజయవంతం చేయొచ్చు.

23 ఏళ్లుగా హార్ట్ ఫుల్‌గా వైద్య సేవలు



కర్నూలు నగరంలో 2002 నుంచి గుండె ఆరోగ్యంపై ప్రత్యేకమైన కృషి జరుగుతోంది. దీని గురించి **కర్నూలు హార్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపక సెక్రటరీ, ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ ఇలా వివరించారు.**

"2002లో వైద్యనిపుణులు, మేధావులతో కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఏర్పాటు చేశాం. అప్పటి కలెక్టర్ సాయిప్రసాద్ ఐఎఎస్ ఛైర్మన్‌గానూ, వ్యవస్థాపకులుగా అప్పటి కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గానూ, సీనియర్ హృద్రోగ నిపుణుడిగా పౌండర్ కార్యదర్శిగా నేను ఉన్నాను. హెల్త్, ఇరిగేషన్, తదితర విభాగాలకు చెందిన అధికారులు, ప్రతినిధులు ఉన్నారు. 2005 నుంచి నుంచి ఏటా వరల్డ్ హార్ట్ డే వేడుకలు నిర్వహిస్తున్నాం. 2011లో కర్నూలు హెల్త్‌క్లబ్ స్థాపించాం. అందులో జిమ్, యోగా, మెడికల్ హాలు, సమావేశ మందిరం వంటివి ఏర్పాటు చేశాం. గత 23 సంవత్సరాలుగా వందలాది ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశాం. అవగాహన, పరిశోధనా, నివారణా పద్ధతులపై సమావేశాలు, సభలు, వర్క్‌షాపులు నిర్వహిస్తూ వస్తున్నాం. కలెక్టర్ హోదాలో ఎవ్వరున్నా హార్ట్ ఫౌండేషన్‌కు ఛైర్మన్‌గా ఉంటారు. వివిధ హార్ట్ ఫౌండేషన్ సంస్థలతో భాగస్వామ్యమై పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది ప్రఖ్యాత కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రతాప్‌చంద్ర రత్‌ను 'అవుట్ స్టాండింగ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్' అవార్డుతో సన్మానిస్తున్నాం. ఆదివారం ఉదయం 11.30 గంటలకు కర్నూలు హెల్త్‌క్లబ్‌లో ఈ కార్యక్రమం జరుగుతుంది."



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68